విశాఖపట్టణం
గురువారం 2 ఏప్రిల్ 2026

For a pure tomorrow..

# జయ జయహే

jayajayahey.in సంపుటి: 9 సంచిక: 68 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool



## పోలవరానికి రూ.1301 కోట్లు

మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వం

ఈ ఆర్థిక సంవత్సరంలో మరో భారీ బడ్జెట్

2




## వ్యతిరేకం కాదంటూనే.. వాకౌట్

అమరావతిపై వైసీపీ వ్యతిరేక గళం

నిరసనగా సభ నుంచి వాకౌట్

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

అమరావతి బిల్లును లోక్ సభలో వ్యతిరేకించింది. అమరావతికి వ్యతిరేకం కాదని తాము చర్చలో పాల్గొంటామని మిథున్ రెడ్డి సమావేశం ప్రారంభానికి ముందు మీడియా ప్రతినిధులతో చెప్పారు. అయితే సభలో చర్చ ప్రారంభమయ్యే సరికి పూర్తిగా వ్యూహం మారిపోయింది. తాడేపల్లిలో జగన్ మోహన్ రెడ్డి ప్రెస్మీట్ చూసిన తర్వాత మిథున్ రెడ్డి తన వ్యూహం మార్చుకున్నారేమో కానీ.. ప్రస్తుత రూపంలో తాము బిల్లును వ్యతిరేకిస్తున్నామని చెప్పి వాకౌట్ చేస్తున్నట్లుగా ప్రకటించి . .. మిగిలిన ముగ్గురు ఎంపీలతో కలిసి బయటకు వెళ్లిపోయారు. ప్రసంగంలో మిథున్ రెడ్డి బిల్లును వ్యతిరేకిస్తూనే తమ పార్టీ అమరావతికి వ్యతిరేకం కాదని, కానీ రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల సమాన అభివృద్ధిని ..మిగతా 2లో

# అమరావతి బిల్లుకు ఆమోదం

మద్దతిచ్చిన అన్ని రాజకీయ పార్టీలు

వ్యతిరేకిస్తూ వాకౌట్ చేసిన వైఎస్సార్సీపీ

దాదాపు రెండు గంటల పాటు సాగిన చర్చ





నేడు రాజ్యసభకు

## అమరావతి బిల్లు

ఇప్పటికే లోక్ సభలో ఆమోదం

నేడు పెద్దల సభలో లాంఛనమే

2

(ప్రత్యేక ప్రతినిధి- జయజయహే)

లోక్‌సభలో ఆంధ్రప్రదేశ్ పునర్విభజన (సవరణ) బిల్లు-2026కు ఆమోదం లభించింది. ఆంధ్రప్రదేశ్ ఏకైక శాశ్వత రాజధానిగా అమరావతిని గుర్తిస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆంధ్రప్రదేశ్ పునర్విభజన సవరణ బిల్లు-2026 కు లోక్‌సభ బుధవారం ఆమోదం తెలిపింది. దాదాపు రెండు గంటల పాటు సాగిన ఈ సుదీర్ఘ చర్చలో వైఎస్ఆర్‌సీపీ మినహా అన్ని పార్టీలు సమర్థించాయి. పదేళ్లుగా నెలకొన్న అనిశ్చితికి తెరదించుతూ, 2024 జూన్ 2 నుండి అమరావతిని అధికారిక రాజధానిగా గుర్తించేలా ఈ బిల్లులో నిబంధనలను చేర్చారు. ఈ బిల్లు ఆమోదంతో అమరావతికి రాజ్యాంగబద్ధమైన గుర్తింపు లభించినట్లయింది.

అమరావతి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. మూజువాణీ ఓటు ద్వారా బిల్లుకు ఆమోదం తెలిపారు. అనంతరం ఈ బిల్లు రాజ్యసభకు వెళ్లనుంది. చర్చలో ఇండీ కూటమి అనూహ్యంగా బిల్లుకు మద్దతు ప్రకటించడం విశేషం. కాంగ్రెస్ పార్టీ తరపున మాణికం ఠాగూర్ వంటి నేతలు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాజధాని ఏర్పాటు ఉండాలని, అమరావతికి తమ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. కేవలం రాజకీయాల కోసం కాకుండా రాష్ట్ర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని తాము ఈ నిర్ణయం తీసుకున్నామని ప్రతిపక్ష సభ్యులు పేర్కొన్నారు. దీంతో బిల్లుపై చర్చలో మెజారిటీ పార్టీలన్నీ ఏకతాటిపైకి వచ్చి సానుకూలత వ్యక్తం చేశాయి. అయితే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాత్రం ఈ బిల్లును తీవ్రంగా ..మిగతా 2లో

# కొత్త రాజధాని మావిగన్..!

మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు కలిపి రాజధాని చేయాలి

మాజీ సీఎం జగన్ ప్రతిపాదన

అమరావతికి వ్యతిరేకం కాదు

శాశ్వత రాజధానిగా ఒప్పుకోం

అమరావతి పేరిట చంద్రబాబు దోపిడీని సహించం

మీడియా సమావేశంలో జగన్ సంచలన వ్యాఖ్యలు



(తాడేపల్లి - జయజయహే)

అమరావతికి వ్యతిరేకం కాదు.. కానీ శాశ్వత రాజధానికి ఒప్పుకోం.. ఇదీ వైఎస్సార్సీపీ విధానం. నాలుగు రోజులుగా రకరకాల స్టేట్‌మెంట్లు ఇచ్చిన వైఎస్సార్సీపీ ఇవాళ కూడా పూర్తి క్లారిటీ ఇవ్వలేదు. ఇప్పుడు ఇంకో కన్ఫ్యూజన్ క్రియేట్ చేసింది. రాజధానిగా ప్రస్తుతం ఉన్న ప్రాంతాన్ని రాజధానిగ్గ ప్రతిపాదిస్తూ.. ఏపీ పునర్వవస్తీకరణ చట్టంలో సవరణ జరుగుతున్న ప్రయత్నంపై నిర్ధిష్టంగా అభిప్రాయం చెప్పకుండా.. రాజధాని ప్రాంతంపై ఓ కొత్త ప్రతిపాదన తెచ్చారు. ఆ పార్టీ అధ్యక్షుడు జగన్. అదే మావిగన్. పార్లమెంట్‌లో ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్ట సవరణ బిల్లుపై చర్చ జరగడానికి కొద్ది సేపటి ..మిగతా 2లో



## అమరావతి రైతులకు థాంక్స్

బిల్లు ఆమోదం పొందటం సంతోషకరం

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

(అమరావతి - జయజయహే)

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లుకు లోక్ సభ ఆమోదం తెలపడంతో ఏపీ ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. రాష్ట్ర ప్రజలంతా గర్వించే క్షణాలివని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ చట్టబద్ధతతో అమరావతి శాశ్వత రాజధానిగా నిలుస్తుందని.. లోక్ సభలో ఈ బిల్లుకు మద్దతు తెలిపిన పార్టీలు, ఎంపీలకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పవన్ ట్వీట్ చేశారు. అమరావతికి చట్టబద్ధత లభించడాన్ని జీర్ణించుకోలేక విషం చిమ్ముతున్న వారికి రాబోయే రోజుల్లో ప్రజలు బలమైన గుణపాఠం నేర్పిస్తారని మండిపడ్డారు. రాజధాని అమరావతికి తోడ్పాటును అందిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు తన అపార అనుభవంతో.. అమరావతి ప్రజారాజధానిగా, ..మిగతా 2లో



## హిందూ వివాహిత ఆస్తిపై భర్తకు హక్కు లేదు

ఆమె తండ్రి తరఫు లీగల్ హెయిర్ కే చెందుతుంది

అనకాపల్లి కేసులో హై కోర్టు సంచలన తీర్పు

(అమరావతి - జయజయహే)

హిందూ వివాహిత మహిళ సంతానం లేకుండా మరణించిన సందర్భంలో ఆమెకు తల్లిదండ్రుల నుంచి వారసత్వంగా సంక్రమించిన ఆస్తిపై ఆమె భర్తకు ఎలాంటి హక్కూ ఉండదని హైకోర్టు స్పష్టం చేసింది. ఆ ఆస్తి తిరిగి ఆమె తండ్రి తరఫు చట్టబద్ధ వారసులకు (లీగల్ హెయిర్స్) చెందుతుందని పేర్కొంది. హిందూ వారసత్వ చట్టంలోని సెక్షన్ 15(2)(ఏ) ఇదే విషయాన్ని చెబుతోందని తెలిపింది. గిఫ్ట్ డీడ్ రద్దు కారణంగా నెలకొన్న వివాదంపై ఆర్డీవో, జాయింట్ కలెక్టర్ పరస్పరం విరుద్ధ ఆదేశాలివ్వగా దీన్ని పరిష్కరిస్తూ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తర్లాడ రాజశేఖరరావు ..మిగతా 2లో

## సామాన్యులపై భారం వేయలేం

ముడి చమురు సరఫరాకు ఇబ్బందులు లేవు

రాబోయే రెండు నెలలకు సరిపోయే నిల్వలు ఉన్నాయి

కేంద్ర ప్రభుత్వం స్పష్టీకరణ



(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

అంతర్జాతీయ మార్కెట్‌లో అనిశ్చిత, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల వేళ దేశంలో ముడి చమురు సరఫరాకు ఎటువంటి ఇబ్బంది లేదని కేంద్రం ప్రకటించింది. రాబోయే రెండు నెలల అవసరాలకు సరిపోయే నిల్వలు అందుబాటులో ఉన్నాయని కేంద్ర పెట్రోలియం, గ్యాస్ మంత్రిత్వ శాఖ తేల్చి చెప్పింది. బుధవారం జరిగిన సమావేశంలో మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ సుజాతా శర్మ మాట్లాడుతూ, దేశంలోని చమురు శుద్ధి కర్మాగారాలు, వాటి పూర్తి సామర్థ్యంతో ..మిగతా 2లో



8

## రష్యాలో కుప్పకూలిన సైనిక విమానం

29 మంది దుర్మరణం చెందినట్లు ధృవీకరణ

# అమరావతి బిల్లుకు ఆమోదం

మొదటి పేజీ తరువాయి...

వ్యతిరేకించింది. వైసీపీ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ ఈ చర్చకు సమాధానమిస్తూ.. ఏపీ అసెంబ్లీ తీర్మానం మేరకే ఈ సవరణ చేస్తున్నామని, ఇది రాష్ట్ర ప్రగతికి ఊతమిస్తుందని పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టు , ఇతర విభజన హామీల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. చర్చ అనంతరం స్పీకర్ ఓం బిర్లా సమక్షంలో మూజువాణి ఓటు ద్వారా ఈ బిల్లును ఆమోదించారు. గురువారం ఈ బిల్లు రాజ్యసభ ముందుకు వెళ్లనుంది. రాజ్యసభలో ఆమోదం తర్వాత రాష్ట్రపతి కి పంపుతారు . అక్కడ తుది ఆమోదం తరవాత గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేస్తారు. దాంతో ఏపీ రాజధానిగా అమరావతి శాశ్వతం అవుతుంది. మళ్లీ మార్చాలంటే.. పార్లమెంట్ లోనే చట్టం చేయాల్సి ఉంటుంది.

## నేడు రాజ్యసభకు అమరావతి బిల్లు

### ఇప్పటికే లోక్ సభలో ఆమోదం

### నేడు పెద్దల సభలో లాంఛనమే

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)



రాజధాని అమరావతిగా చట్టబద్ధత కల్పించిన బిల్లుకు బుధవారం లోక్‌సభలో ఆమోదం పొందింది. అనంతరం ఈ బిల్లు రాజ్యసభకు చేరింది. ఈ బిల్లు తమ వద్దకు వచ్చిందని రాజ్యసభ సెక్రటరీ జనరల్ ఈ రోజు న్యూఢిల్లీలో వెల్లడించారు. ఈ బిల్లు ఆమోదం కోసం గురువారం రాజ్యసభలో పెడతామని స్పష్టం చేశారు. రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లును గురువారం రాజ్యసభలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ ప్రవేశపెట్టనున్నారు. అనంతరం మధ్యాహ్నం 1.00 గంటకు ఈ బిల్లుపై సభలో చర్చ జరగనుంది. రాజ్యసభలో సైతం ఈ బిల్లు ఆమోదం పొందితే.. అనంతరం రాష్ట్రపతి వద్దకు ఈ బిల్లును పంపుతారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సైతం ఈ బిల్లును ఆమోదిస్తూ సంతకం చేస్తే.. రాజధాని అమరావతి చట్టంగా మారుతోంది. పునర్విభజన చట్ట సవరణ పేరుతో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ బుధవారం లోక్‌సభలో ఈ బిల్లును ప్రవేశపెట్టారు. సుమారు రెండు గంటలపాటు దీనిపై చర్చ జరిగింది. ఈ చర్చలో టీడీపీ, బీజేపీ, జనసేన, కాంగ్రెస్, వైసీపీ సమాజ్ వాదీతోపాటు పలు పార్టీలు ఎంపీలు పాల్గొన్నారు. అనంతరం ఈ బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపినట్లు స్పీకర్ స్థానంలో ఉన్న తెన్నేటి కృష్ణప్రసాద్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి అంటూ రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించింది. దీనిని కేంద్రానికి పంపిన విషయం విదితమే.



### పోలవరానికి

## రూ.1301 కోట్లు

### మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వం

### ఈ ఆర్థిక సంవత్సరంలో మరో భారీ బడ్జెట్

(అమరావతి - జయజయహే)

ఆంధ్రప్రదేశ్ జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులను వేగవంతం చేసే దిశగా ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ప్రాజెక్టు పనుల కోసం తాజాగా మరో ₹1,301 కోట్ల అడ్వాన్స్ నిధులను విడుదల చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే కేంద్రం ₹1,508 కోట్లు విడుదల చేయగా, తాజా నిధులతో కలిపి మొత్తం నిధుల వాటా ₹2,809 కోట్లకు చేరింది. దీంతో 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్ర బడ్జెట్‌లో సవరించిన అంచనాల మేరకు కూటమి ప్రభుత్వం దాదాపుగా నిధులను పొందినట్లయింది.

## వ్యతిరేకం కాదంటూనే.. వాకౌట్

మొదటి పేజీ తరువాయి...

ఆకాంక్షిస్తుందని స్పష్టం చేశారు. కేవలం ఒకే ప్రాంతానికి రూ. 15 వేల కోట్లు కేటాయించడం వల్ల మిగిలిన వెనుకబడిన ప్రాంతాలైన రాయలసీమ, ఉత్తరాంధ్రలు నిర్లక్ష్యానికి గురవుతాయన్నారు. కేంద్రం ఇచ్చే ఈ నిధులు గ్రాంటుగా ఉండాలని, అప్పుల రూపంలో ఇస్తే రాష్ట్రం మరింత ఆర్థిక సంక్షోభంలో పడుతుందన్నారు. రాజధాని నిర్ణయం అన్నది రాష్ట్ర నిర్ణయం అని గతంలో కేంద్రం హైకోర్టులో అఫిడవిట్ వేసిందన్నారు. అమరావతి రైతులకు ప్లాట్లు ఎప్పుడిస్తారో బిల్లులో పెట్టాలన్నారు. ఇప్పటికే యాభై వేల ఎకరాలున్నాయని..మరో యాభై వేల ఎకరాలెందుకని మిథున్ రెడ్డి ప్రశ్నించారు. విభజన చట్టంలోని హామీలను కేంద్రం అమలు చేయడం లేదన్నారు. ఏడు వెనుకబడిన జిల్లాలకు ఇస్తామన్న బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీని వెంటనే విడుదల చేయాలని కోరారు. రాజధాని కోసం తీసుకున్న రుణాలు భవిష్యత్తులో రాష్ట్ర ప్రజలపై భారంగా మారుతాయని, ఈ విషయంలో స్పష్టత ఇవ్వాలని కోరారు. అలాగే, పోలవరం ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసేందుకు అవసరమైన నిధులను విడుదల చేయాలని, రాష్ట్రానికి ప్రత్యేక హోదా అంశాన్ని విస్మరించకూడదని ఆయన ప్రసంగంలో చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ పట్ల చూపిస్తున్న వివక్షకు నిరసనగా వైఎస్సార్‌సీపీ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేస్తున్నట్లు ప్రకటించారు. కేవలం ఒకే నగరానికి ప్రాధాన్యత ఇస్తూ, రాష్ట్రం మొత్తం సమతుల్యంగా ఎదగాలన్న వికేంద్రీకరణ ఆలోచనను కేంద్రం పరిగణనలోకి తీసుకోకపోవడం దురదృష్టకరమని ఆయన వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం, వెనుకబడిన ప్రాంతాల హక్కుల కోసం తమ పోరాటం పార్లమెంటు లోపల , వెలుపల కొనసాగుతుందని చెప్పారు.

## కొత్త రాజధాని మావిగన్..!

మొదటి పేజీ తరువాయి...



ముందు ఓటింగ్‌కు తాము హాజరవుతామని... బిల్లును సమర్థిస్తామని వైఎస్సార్ సీపీ చెప్పినట్లు వార్తలు వచ్చాయి. కానీ . ఆ కొద్దిసేపటికి ఆ పార్టీ అధ్యక్షుడు జగన్ మోహనరెడ్డి ప్రెస్‌మీట్ పెట్టారు. అమరావతికి తాము అప్పుడు.. ఇప్పుడు.. ఎప్పుడూ వ్యతిరేకం కాదని చెబుతూనే.. ఇంతవరకూ ఎవరూ ఆలోచించని మావిగన్ ప్రతిపాదన తెచ్చారు. మీడియా సమావేశంలో జగన్ మోహనరెడ్డి ఓ కొత్త ప్రతిపాదన తెచ్చారు. అదేంటంటే.. మావిగన్. విచిత్రంగా ఉన్న ఈ పేరను ఆయనే సూచించారు. ఇదేంటంటే.. ప్రస్తుతం ఉన్న అమరావతి ప్రాంతాన్ని విస్తరించాలని సూచించారు. "విజయవాడ నుంచి మచిలీపట్నానికి 70 కి.మీ - విజయవాడ నుంచి గుంటూరుకు 40 కి.మీ - మొత్తం 110 కి.మీలలో నేషనల్ హైవే ఉంది - దీన్ని మొత్తం క్యాపిటల్ గా ప్రకటించండి - 'మావిగన్' అని పేరు పెట్టండి - రూ. 2లక్షల కోట్లలో 10% పెడితే చాలు -- అమరావతిలో 2 లక్షల కోట్లు పెడితే రాష్ట్రం, ప్రజలు ఏం కావాలి - రాష్ట్రానికి గ్రోత్ ఇంజిన్ లాంటి రాజధాని కావాలి " అన్నారు. అమరావతికి తాను ఎప్పుడూ వ్యతిరేకం కాదన్నారు. అయితే రాజధాని పేరుతో దోపిడీ చేస్తున్నారని ఆ దోపిడీని డైవర్ట్ చేయడానికే శాశ్వత హోదా అనే డ్రామాలాడుతున్నారని జగన్ అన్నారు.

### అమరావతికి మద్దతుపై పిల్లిమొగ్గలు

జగన్ ప్రెస్‌మీట్ నిర్వహిస్తున్న సమయంలోనే పార్లమెంట్‌లో ఈ బిల్లు చర్చకు వచ్చింది. దీనిపై వైఎస్సార్ సీపీ తీవ్ర గందరగోళంలో పడింది. నిన్నటి వరకూ ఆ పార్టీ నేతలు వ్యాఖ్యలు చూస్తే.. బిల్లుకు మద్దతివ్వరనిపించింది. ఆ తర్వాత ఇవాళ పొద్దున బిల్లును సమర్థిస్తున్నామని వైఎస్సార్సీపీ పార్లమెంటరీ పార్టీ నాయకుడు... మిథున్ రెడ్డి చెప్పినట్లు వార్తలు వచ్చాయి.. తీరా బిల్లు హౌస్‌లోకి వచ్చాక..బిల్లును వ్యతిరేకిస్తున్నామని చెప్పి వాకౌట్ చేశారు.. ఓ వైపు ఆ పార్టీ ఎంపీలు వాకౌట్ చేస్తుంటే.. ఇంకో వైపు కొద్ది క్షణాల ముందు ఆ పార్టీ అధినేత జగన్ అమరావతి గురించి మాట్లాడారు.

### అమరావతి పేరుతో అవినీతి

అమరావతి ప్రాంతాన్ని రాజాధానిగా అంగీకరిస్తున్నామని చెబుతూనే చంద్రబాబు ప్రభుత్వం రాజధాని పేరుతో దోపిడీ చేస్తోందని జగన్ ఆరోపించారు. అవినీతిపై ప్రజల దృష్టిని మరల్చేందుకే.. శాసనసభలో అమరావతిపై తీర్మానం అనే ఒక డ్రామా చేశారన్నారు. "రాజ్యాంగంలో ఎక్కడా రాజధాని అనే పదం లేదు అని ఛత్తీస్ గఢ్, జార్ఖండ్ రాజధానులను కేంద్రం నిర్ణయించలేదని ఆయా రాష్ట్రాలే రాజధానులను నిర్ణయించుకున్నాయని చెప్పారు. "ఏడేళ్లు సీఎంగా ఉండి అమరావతిలో మీరు చేసిందేంటి? - భూములిచ్చిన రైతుల హామీలు నెరవేర్చారా? - అమరావతిని ఎందుకు పెంచుకుంటూ పోతున్నారు?" అని ప్రశ్నించారు. "రోడ్లు, డ్రైనేజీలకే ఎకరానికి రూ.2 కోట్లు అవుతుందని చంద్రబాబు లెక్కలే చెప్తున్నాయి - ఆ లెక్కన లక్ష ఎకరాలకు 2 లక్షల కోట్లు కావాలి - రూ.2 లక్షల కోట్లు ఎక్కడి నుంచి వస్తాయని జగన్ నిలదీశారు.

2014-19 మధ్య రూ.5,335 కోట్లు ఖర్చు చేశారు - ఈ రెండేళ్లలో అమరావతికి బాబు చేసిన అప్పు 47వేల కోట్లు - అమరావతి కోసం ఏడేళ్లలో మొత్తం 8వేల కోట్లు ఖర్చు చేశారు - ఏడేళ్లలో 8వేల కోట్లు ఖర్చు పెడితే.. రూ.2లక్షల కోట్లు ఖర్చు చేయడానికి ఎన్నేళు పడుతుంది - అమరావతిలోనే వేల కోట్లు ఖర్చు చేస్తే.. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి పరిస్థితేంటన్నారు.

2019కి ముందు మాస్టర్ ప్లాన్ ను ఎందుకు మారుస్తున్నారు - ఒకప్పుడు వరల్డ్ క్లాస్ సిటీ అని చంద్రబాబు ఊదరగొట్టారు - ఇప్పుడు మున్సిపాలిటీగా మిగిలిపోతుందని ఎందుకంటున్నారు -- చదరపు అడుగుకు 11 వేల నుంచి 14వేలు అవుతుందని చెప్తున్నారు ఇదేక్కడైనా ఉందా అని ప్రశ్నించారు.

### చంద్రబాబు మనస్ఫూర్తిగా ఉన్నాడా..?

అమరావతికి తానెప్పుడూ వ్యతిరేకం కాదని జగన్ స్పష్టం చేశారు. 12 ఏళ్లలో మనస్ఫూర్తిగా చంద్రబాబు అమరావతిలో ఉన్నారా? - ఇప్పటికీ కూడా మీ కుటుంబాలు ఎక్కడున్నాయి అంటూ జగన్ కామెంట్ చేశారు. 2019 వరకు హైదరాబాద్ కు షటిల్ సర్వీస్ చేశారు - ఇప్పుడు కూడా హైదరాబాద్ కు షటిల్ సర్వీసే - పవన్, లోకేష్ 4 రోజులు కూడా అమరావతిలో ఉండటం లేదని ఆక్షేపించారు. రాష్ట్రంపై భారం పడకూడదని, అభివృద్ధి, సంక్షేమం కుంటుపడకూడదని మనం కూడా చెన్నై, బెంగళూరుతో పోటీ పడాలని.. విశాఖను ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్ గా చేశాం - శ్రీబాగ్ ఒడంబడిక ప్రకారం హైకోర్టు పెట్టాలనేది ఒప్పందం - ఒప్పందాన్ని గౌరవిస్తూ కర్నూలును న్యాయ రాజధాని చేశాం. అమరావతిని ఏనాడూ మేం నిర్లక్ష్యం చేయలేదు - అమరావతిలో భూములిచ్చిన రైతుల కౌలు పెంచాం అని జగన్ గుర్తు చేశారు.

## హిందూ వివాహిత ఆస్తిపై భర్తకు హక్కు లేదు

ఇటీవల ఈ మేరకు తీర్పు ఇచ్చారు.

### ఇదీ కేసు..

అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం పెంటకోట గ్రామంలో చిక్కాల వెంకాయమ్మకు 1.50 ఎకరాల భూమి ఉంది. ఆమె కుమారుడు దత్తాత్రేయకు శ్రీవిరిత, దేవిక మానస అనే ఇద్దరు కుమార్తెలున్నారు. శ్రీవిరితకు బదిరెడ్డి శ్రీరామదొరతో వివాహమైంది. నాయనమ్మ వెంకాయమ్మ శ్రీవిరితకు 1.50 ఎకరాల భూమిని 2002లో గిఫ్ట్ డీడ్‌గా ఇచ్చారు. దీంతో శ్రీవిరిత పేరు రెవెన్యూ రికార్డుల్లో ఎక్కింది. పాస్ పుస్తకం కూడా పొందారు. ఆమె 2005లో అకాల మరణం పొందారు. దీంతో వెంకాయమ్మ 2007లో గిఫ్ట్ డీడ్‌ను రద్దు చేశారు. 2011లో రెండో మనవరాలు చిక్కాల దేవిక మానసకు ఆ భూమిని గిఫ్ట్‌గా రాసిచ్చారు. వెంకాయమ్మ 2012లో కన్నుమూశారు.

రెవెన్యూ రికార్డుల్లో దేవిక మానస పేరును చేర్చేందుకు వీలుగా 2017లో నర్సీపట్నం ఆర్డీవో ఉత్తర్వులిచ్చారు. వాటిని సవాలుచేస్తూ శ్రీవిరిత భర్త శ్రీరామదొర అనకాపల్లి జేసీ వద్ద రివ్యూ పిటిషన్ దాఖలు చేశారు. 2023లో జేసీ తన నిర్ణయాన్ని ప్రకటిస్తూ ఆర్డీవో ఉత్తర్వులను తప్పుపట్టారు. ఒకసారి గిఫ్ట్ డీడ్ ఇచ్చాక రద్దు చేయడానికి వీల్లేదని, దాన్ని రద్దు చేయాలనుకుంటే సివిల్ కోర్టును ఆశ్రయించాలని పేర్కొన్నారు. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ దేవిక, ఆమె తండ్రి అదే ఏడాది హైకోర్టును ఆశ్రయించారు. వారి తరఫున న్యాయవాది వెంకట సుబ్బరాజు వాదనలు వినిపిస్తూ 'హిందూ వారసత్వ చట్టంలోని సెక్షన్ 15(2)(ఏ)కి వ్యతిరేకంగా జేసీ ఉత్తర్వులిచ్చారు. వాటిని రద్దు చేసి దేవిక మానస పేరును రికార్డుల్లో చేర్చేలా ఆదేశించండి' అని కోరారు.

ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి, హిందూ వారసత్వ చట్టం సెక్షన్ 15(2)(ఏ) ప్రకారం హిందూ మహిళకు తల్లిదండ్రుల నుంచి వారసత్వంగా వచ్చిన ఆస్తిపై ఆమె భర్తకు హక్కు ఉండదని, ఆ దంపతులకు సంతానం లేకపోతే ఆమె కన్నుమూశాక ఆ ఆస్తి తిరిగి ఆమె తండ్రి తరఫు వారసులకు చెందుతుందని స్పష్టతనిచ్చారు. వెంకాయమ్మ మొదటి మనవరాలు శ్రీవిరితకు రాసిచ్చిన ఆస్తిపై ఆమె భర్త శ్రీరామదొర హక్కు పొందజాలరని పేర్కొన్నారు.

మరోవైపు శ్రీవిరితకు రాసిన డీడ్‌ను వెంకాయమ్మ రద్దు చేయడాన్ని సైతం శ్రీరామదొర సవాలు చేయడానికి వీల్లేదని తేల్చిచెప్పారు. బతికి ఉంటే శ్రీవిరిత మాత్రమే గిఫ్ట్ డీడ్ రద్దు చేయడాన్ని సవాలు చేయగలిగేవారని పేర్కొన్నారు. 1.50 ఎకరాలకు వారసురాలిగా రెవెన్యూ రికార్డుల్లో దేవిక మానస పేరును చేర్చాలని పాయకరావుపేట తహసీల్దార్‌ను ఆదేశించారు.

## సామాన్యులపై భారం వేయలేం

మొదటి పేజీ తరువాయి...



పని చేస్తున్నాయని వెల్లడించారు. రిటైల్ అవుట్‌లెట్‌లలో లేదా పెట్రోల్ బంకుల్లో ఎక్కడా ఇంధన కొరత ఏర్పడినట్టు నివేదికలు అందలేదని, సరఫరా గొలుసు పటిష్టంగా ఉందని తెలిపారు. ప్రపంచ మార్కెట్‌లో ముడి చమురు ధరలు గత కొద్ది కాలంగా తీవ్రమైన హెచ్చుతగ్గులకు లోనవుతున్నాయి. సుమారు రెండు నెలల క్రితం బ్రెంట్ క్రూడ్ ధర ఒక బ్యారెల్‌కు 70 డాలర్ల వద్ద ఉండగా, ప్రస్తుతం అది వందల డాలర్ల మార్కును దాటిపోయింది. అంటే దాదాపు 40 శాతానికిపైగా ధర పెరిగినప్పటికీ, భారత ప్రభుత్వం దేశీయ వినియోగదారులపై ఆ భారాన్ని పడనీయలేదని చెప్పారు. సాధారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో ధఱలు పెరిగినప్పుడు దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడం సహజం. అయితే ప్రస్తుతం పరిస్థితుల్లో సామాన్యులకు ఊరటనిస్తూ ధరలను స్థిరంగా ఉంచుతున్నట్టు ప్రకటించింది. భారత్ తన ఎల్పీజీ అవసరాల కోసం దాదాపు 60 శాతం దిగుమతులపై ఆధారపడుతోంది. అంతర్జాతీయంగా సౌదీ సీపీ బెంచ్‌మార్క్ ధరలు గత నెలతో పోలిస్తే 522 డాలర్ల నుంచి 780 డాల్లర్లకు పెరిగాయి. ఇది సుమారు 44 శాతం పెరుగుదల అయినప్పటికీ దేశీయంగా వంట గ్యాస్ సిలిండర్ల ధరలను ప్రభుత్వం పెంచలేదు. ధరలు పెంచకపోవడమే కాకుండా వినియోగదారులకు సేవలను అందించడంలో సాంకేతికతను జోడించి సేవలను మరింత పారదర్శకంగా చేస్తున్నట్టు పేర్కొన్నారు. ప్రస్తుతం 92 శాతం ఎల్పీజీ బుకింగ్ ఆన్‌లైన్ ద్వారానే జరుగుతున్నాయి. మంగళవారం ఒక్కరోజే దేశవ్యాప్తంగా 60 లక్షల సిలిండర్ల డెలివరీ పూర్తి అయిందంటే వ్యవస్థ ఎంత పకడ్బందీగా ఉందో తెలుస్తుందని వెల్లడించారు. గ్యాస్ ఏజెన్సీల వద్ద ఎక్కడా స్టాక్ అయిపోయినట్టు ఫిర్యాదులు రాలేదని సుజాత శర్మ వివరించారు.

### పీఎన్జీ, సీఎన్జీ నెట్‌వర్క్ విస్తరణకు చర్యలు

కేవలం పెట్రోల్ డీజిల్‌కే పరిమితం కాకుండా గృహ అవసరాలకు పైపుల ద్వారా సరఫరా చేసే గ్యాస్, రవాణా రంగంలో వాడే సీఎన్జీ నెట్‌వర్క్‌ను విస్తరించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ప్రకటించారు. దేశీయ వినియోగదారులకు, రవాణా రంగానికి వంద శాతం సరఫరాకు ఎలాంటి ఆటంకం రాకుండా చర్యలు తీసుకున్నామని వెల్లడించారు.

దేశంలో ఇంధన నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని ప్రజలు భయపడొద్దని సుజాతా శర్మ ధైర్యం చెప్పారు. అనవసరంగా భయపడి అవసరానికి మించి పెట్రోల్, డీజిల్ నిల్వ చేసుకోవద్దని కూడా సూచించారు. రిఫైనరీలు గరిష్ట స్థాయిలో ఉత్పత్తిని సాగిస్తున్నాయని, సరఫరాలో ఎలాంటి అంతరాయం ఉండబోదని కూడా భరోసా ఇచ్చారు.

## అమరావతి రైతులకు థాంక్స్

మొదటి పేజీ తరువాయి...

భావితరాల అభివృద్ధికి కేంద్రంగా నిలుస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

### డిప్యూటీ సీఎం పవన్ ట్వీట్..

'లోక్ సభలో అమరావతి బిల్లు ఆమోదం పొందిన ఈ చారిత్రక సందర్భంలో ఆంధ్రప్రదేశ్‌లోని ఐదు కోట్ల మంది పౌరులకు నా హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నా. ఈరోజు ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఒక కీలక మలుపుగా నిలుస్తుంది. అమరావతిని ఏపీ ఏకైక, శాశ్వత రాజధానిగా ప్రకటిస్తూ అమరావతి బిల్లు ఆమోదం పొందడం ప్రజా సంకల్పం, స్థైర్యం, ఆశయాలకు ప్రతిబింబంగా నిలుస్తోంది. రాజధానికి 33,000 ఎకరాలకు పైగా భూమిని అప్పగించి సాటిలేని త్యాగం చేసిన అమరావతి ప్రాంత రైతాంగానికి నా ప్రగాఢ కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. వారి చేసిన త్యాగం తరతరాలపాటు గుర్తుండిపోతుంది.

అమరావతి నిర్మాణానికి పునాది వేసి అచంచలమైన నిబద్ధత కలిగిన సీఎం చంద్రబాబు దూరదృష్టితో కూడిన నాయకత్వాన్ని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా. ఈ కలను సాకారం చేయడంలో నిరంతర మద్దతు అందించిన ప్రధాని మోదీ, ఎన్డీయే ప్రభుత్వానికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు. గత ప్రభుత్వపు తిరోగమన, ఏకపక్ష నిర్ణయాల వల్ల తలెత్తిన సవాళ్ల సమయంలో రాష్ట్ర ప్రజలు అద్భుతమైన ధైర్యాన్ని ప్రదర్శించారు. తమ ఆశయాలకు అనుగుణంగా స్థిరమైన ఎన్డీయే ప్రభుత్వాన్ని ఎన్నుకోవడం ద్వారా ప్రగతి, స్థిరత్వానికి అనుగుణమైన భవిష్యత్తును ఎంచుకున్నారు.

పార్లమెంటు ఈ బిల్లును ఆమోదించడంతో ఆంధ్రప్రదేశ్ ప్రజల్లోనే కాకుండా పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారుల్లో బలమైన నూతన విశ్వాసం చిగురించింది. అమరావతి ఇకపై కేవలం ఒక రాజధానిగా మాత్రమే కాకుండా ఆశలకు, స్థైర్యానికి, సమష్టి సంకల్పానికి ప్రతీకగా నిలుస్తుంది. 'స్వర్ణ ఆంధ్ర-2047' కలను సాకారం చేయడంలో అమరావతి కీలకపాత్ర పోషిస్తుందని, అలాగే ప్రధాని మోదీ 'వికసిత్ భారత్- 2047' లక్ష్యానికి గణనీయమైన తోడ్పాటును అందిస్తుందని దృఢంగా విశ్వసిస్తున్నా' అంటూ పవన్ కల్యాణ్ ట్వీట్ చేశారు.

# ఫించన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వంశీ కృష్ణ

**విశాఖపట్నం (జయ జయహే)**

దక్షిణ నియోజకవర్గం 29వ వార్డు శ్రీరంగాపురం ఏరియాలో ఎన్.టి.ఆర్ భరోసా ఫించన్లు పంపిణీ కార్యక్రమంలో విశాఖ దక్షిణ నియోజకవర్గం శాసన సభ్యులు వంశీ కృష్ణ శ్రీనివాస్ పాల్గొని అర్హులకు ఫించన్లు పంపిణి చేసారు పేద కుటుంబాలకు ప్రతి నెల 1వ తేదీన ఉదయం 6 గంటల నుండి సచివాలయం సిబ్బందితో పేద,వికలాంగ,వితంతు ఫించన్లు ఇచ్చి కూటమి ప్రభుత్వం వారికి ఆర్థికంగా అండగా ఉంటుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ నేతృత్వంలో పేద కుటుంబాలు బంగారు కుటుంబాలుగా నామకరణం చెందాయని ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్ తెలియజేశారు.రానున్న రోజుల్లో నియోజకవర్గంలో ఉన్న అర్హులందరికీ కూడా ఫించన్లు వచ్చే విధంగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వంశీ కృష్ణ



శ్రీనివాస్ తో పాటు జోనల్ కమిషనర్ మల్లయ్య నాయుడు , పద్మావతి ,29వ వార్డు కట్ ఇంచార్జి గొలగాని రవిశ్వరావు , మాజీ కార్పొరేటర్ బుద్ధల అనురాధ , తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఉరికిటి గణేష్ ,జనసేన అధ్యక్షులు అంగటి శ్రావణ్ కుమార్,కూటమి నాయకులు మురళి కృష్ణ, కిలానీ



వెంకటేష్,నడుపురి రాజు,కర్రి చిన్ని,శ్రీకాంత్,పడిమి కిషోర్ , మజ్జి శ్రీను, మెకానిక్ అప్పలరాజు,శ్రీకాంత్,సుమంత్,లక్ష్మణ్,ఒమ్మి సాయి,భార్గవ్,కమల్,నరేష్ మరియు సచివాలయం సిబ్బంది,ఆర్.పిలు పాల్గొన్నారు.



## నిడదవోలులో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి :**

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం కింద ప్రతినెల ఒకటో తారీఖున అందించే పెన్షన్ పంపిణీ కార్యక్రమం నిడదవోలులో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర నైపుణ్య సమస్త చైర్మన్ బూరుగుపల్లి శేషారావు మార్గదర్శకత్వంలో, నిడదవోలు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ ఆదేశాల మేరకు కార్యక్రమం కొనసాగింది. ఈ కార్యక్రమాన్ని పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొమ్మన వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. పట్టణంలోని వివిధ వార్డుల్లో స్వర్ణ వార్డు సచివాలయ సిబ్బందితో కలిసి లబ్ధిదారులకు పెన్షన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాలుగో వార్డు కన్వీనర్ శల బోయిన వెంకటరమణ, వార్డు ప్రెసిడెంట్ ఆమర్తి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ప్రభుత్వ సేవలపై సంతృప్తి వ్యక్తం చేస్తూ, పథకం కొనసాగాలని ఆకాంక్షించారు




## కొత్తపల్లిలో పింఛన్లు పంపిణీ

**పేదల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం**

**తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి కోడా సురేష్**

పాడేరు (జయ జయహే) ఎన్టీఆర్ పింఛను పంపిణి కార్యక్రమం బుధవారం జి.ముంచిగిపుట్టులో తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోడా వెంకట సురేష్ కుమార్ పింఛన్లు పంపిణీ చేశారు.అనంతరం మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశానుసారం పింఛన్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించామన్నారు.ప్రతి నెల ఒకటవ టరీఖున పింఛన్లు పంపిణీ చేయడం కేవలం కూటమి పార్టీకే సాధ్యమన్నారు. సంక్షేమం అభివృద్ధి రెండుకళ్లుగా భావించే ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది కేవలం కూటమి ప్రభుత్వమే అని ఆయన కొనియాడారు.ఈ కార్యక్రమంలో చింతలవీధి, గుత్తులపుట్టు యూనిట్ ఇంచార్జ్ లు తామర మూర్తిబాబు, కొంతెలి వెంకట ప్రసాద్, డి ఏ సత్యరావు,కిల్లు సుభద్ర, చంటిబాబు, దేముళ్ల తదితరులు పాల్గొన్నారు




## నిడదవోలు అభివృద్ధియే నా లక్ష్యం:

**మంత్రి కందుల దుర్గేష్**

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి :**

నిడదవోలు నియోజకవర్గ అభివృద్ధి కోసం తాను అహర్నిశలు కృషి చేస్తున్నానని, గత ప్రభుత్వ వైఫల్యాలను అధిగమిస్తూ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నానని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. ఇటీవల ఒక టీవీ ఛానెల్లో ప్రసారమైన కథనాలపై స్పందిస్తూ .మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ, గత 22 నెలల కాలంలో నియోజకవర్గ అభివృద్ధి కోసం సుమారు రూ.500 కోట్లకు పైగా నిధులను సమీకరించినట్లు తెలిపారు. 2019 నుండి 2024 మధ్య రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉండేదని, ప్రస్తుతం ఆర్ అండ్ బి మరియు గ్రామీణ రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు.నిడదవోలు పట్టణాన్ని అన్ని రంగాల్లో సుందరీకరించేందుకు కౌన్సిల్ సభ్యులు, చైర్మన్ సహకారంతో చర్యలు చేపడుతున్నట్లు ఆయన వెల్లడించారు.రాజకీయ విమర్శలపై స్పందిస్తూ, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు తాను నిడదవోలు నుండి పోటీ చేశానని, ఆయన చూపిన మార్గంలో క్రమశిక్షణతో పనిచేస్తానని స్పష్టం చేశారు.తనపై మరియు ప్రభుత్వంపై కొందరు కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని, అలాంటి ఆరోపణలను ప్రజలు నమ్మరని అన్నారు. వైసీపీ అనుకూల మీడియా ప్రచారం చేస్తున్న కథనాలకు ఎటువంటి ప్రాధాన్యం లేదని కొట్టిపారేశారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశీస్సులతో నిడదవోలు నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉన్నానని మంత్రి కందుల దుర్గేష్ పునరుద్ఘాటించారు.

## ఘనంగా ఈర్లె శ్రీరామమూర్తి జన్మదిన వేడుకలు

**బుచ్చియపేట జయ జయహే**

చోడవరం ఫంక్షన్ హాల్ లో బుధవారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సంఘాల వ్యవస్థాపకులు, బిజెపి కీలక నేత, మీడియా ప్యానలిస్ట్ ,కొప్పుల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ ఆయన ఈర్లె శ్రీరామ్ మూర్తి 67వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. గ్రామస్థాయి నుంచి దేశస్థాయి కీలక నేతలతో పరిచయాలు ఉన్న కీలకమైన వ్యక్తి నిరుద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పనలో ప్రధాన పాత్ర పోషించడంతో బిజెపి మండల పార్టీ అధ్యక్షులు సీతా నాగరాజు ,బిజెపి బుచ్చయ్యపేట మండల ప్రధాన కార్యదర్శి గొల్లగాని శ్రీనివాస్ యాదవ్,ఆకుల నాగేశ్వర రావు పలువురు కూటమి నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు.






## విశిష్ట సేవలకు పురస్కారం

**న్యూఢిల్లీలో రమేష్‌కి గౌరవ డాక్టరేట్ ప్రధానం**

**విశాఖపట్నం (జయ జయహే)**

ఆరోగ్య పరిరక్షణ పై ప్రజల్లో అవగాహన కల్పించడంలో విశేష కృషి చేస్తున్న వీ డెంటల్ హాస్పిటల్స్ డైరెక్టర్ కె.ఎం.కె.రమేష్ కి వరల్డ్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ గౌరవ డాక్టరేట్ పురస్కారాన్ని ప్రధానం చేసి సత్కరించింది. ఈ మేరకు మంగళవారం న్యూఢిల్లీలో జరిగిన ప్రత్యేక సదస్సులో వివిధ దేశాల రాయబార ప్రతినిధులు, యునెస్కో ప్రతినిధులు పాల్గొని దేశవ్యాప్తంగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న వ్యక్తులకు ఈ అవార్డులను అందజేశారు.ఉచిత వైద్య శిబిరాల ద్వారా వేలాది మందికి ఆరోగ్య పరిరక్షణ పట్ల అవగాహన కల్పించడం, పేదలకు ఉచిత వైద్య సేవలు అందజేయడం, పర్యావరణ పరిరక్షణకు పలు కార్యక్రమాల ద్వారా ప్రజలను చైతన్య పరచడం వంటి సామాజిక సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా కె.ఎం. కె. రమేష్ కి ఈ అవార్డు లభించింది. క్రొయేషియా రాయబార ప్రతినిధి బ్రనిమిర్ ఫర్కస్, యునెస్కో ప్రతినిధి నీవిహా, బుర్కినా ఫాసో రాయబార ప్రతినిధి డాక్టర్ డిజైర్ బోనిపే సం, ఉత్తరప్రదేశ్ కార్మిక శాఖ మంత్రి అనిల్ రాజ్ భర్, భారత్ గౌరవ్ రత్న శ్రీ సమ్మాన్ అవార్డు కౌన్సిల్ సీఈవో డాక్టర్ కవిత బజాజ్ ఈ కార్యక్రమంలో పాల్గొని పురస్కారాలు అందజేశారు. కె.ఎం.కె. రమేష్ విశాఖపట్నం శంకరమఠం రోడ్ లో వి హెల్త్ కేర్ స్థాపించి అనేక వైద్య శిబిరాల ద్వారా నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్ పరీక్షలు ఉచితంగా అందజేసిన కార్యక్రమాలు ప్రజల మన్ననలు పొందాయి. రోటరీ ఇంటర్నేషనల్, జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్, వాసవి క్లబ్, వాకర్స్ క్లబ్ వంటి సంస్థలతో కలిసి కె. ఎం. కె. రమేష్ అనేక సేవ కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన సేవలను గుర్తించి డబ్ల్యూ. హెచ్.ఆర్. పి.సి. నేషనల్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ కె శృతి రమేష్ కు గౌరవ డాక్టరేట్ అవార్డు ని ప్రతిపాదించారు. గౌరవ డాక్టరేట్ అవార్డు స్వీకరించిన సందర్భంగా రమేష్ ను భీమిలి ఎమ్మెల్యే గంట శ్రీనివాసరావు, విశాఖ ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ అభినందించారు.




## లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా షుగర్ ఫ్యాక్టరీ వద్ద బ్లాక్ డే

**చోడవరం ఏప్రిల్ 1 జయ జయహే**

కార్మికలకు నష్టం కలిగించే లేబర్ కోడ్స్ రద్దు చేయాలనీ కోరుతూ కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపులో భాగంగా బుధవారం గోవాడ ఫ్యాక్టరీ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. దేశ వ్యాప్తంగా అమలు లోకి వస్తున్న లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, 29 కార్మిక చట్టాలను యధావిధిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఫ్యాక్టరీ కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసనలు తెలియజేశారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు వి వి శ్రీనివాసరావు, ఫ్యాక్టరీ యూనియన్ నాయకులు రామునాయుడు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్స్ తీసుకొచ్చిందని, భారత దేశంలో ఉన్న బడా పారిశ్రామికవేత్తలకు అనుకూలమైన ఈ లేబర్ కోడ్స్ కార్మికులకు ఉరితాడు వంటివని, బ్రిటిష్ కాలం నుండి పోరాడి సాధించుకున్న కార్మికులకు అనుకూలమైన 29 చట్టాలను రద్దు చేశారని, బానిసలుగా కార్మికులతో పని చేయించుకునే పరిస్థితి వస్తుందన్నారు. కాబట్టి పాత 29 చట్టాలు పునరుద్ధరణ చేసి, నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని అన్నారు. గోవాడ షుగర్ ఫ్యాక్టరీ కూడా ప్రభుత్వాల విధానాల వల్ల కార్మికులకు, రైతులకు బకాయిలు కూడా ఇవ్వకపోవడం తో పాటు ఫ్యాక్టరీనీ తిప్పకుండా చేశారన్నారు. ఫ్యాక్టరీ తిప్పడం, బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ వి నాయుడు, రాయి సూరిబాబు, రామ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



## రాజేంద్రపాలెంలో నూతన సచివాలయం ప్రారంభం

**సర్పంచ్ పిటా సింహాచలం**

**కొయ్యూరు : (జయ జయహే )న్యూస్ ఏప్రిల్ 02**

అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం, రాజేంద్రపాలెం హెడ్ క్వార్టర్ నేడు నూతన గ్రామ సచివాలయం సర్పంచ్ పిటా సింహాచలం వైభవంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమం లో తెదేపా సీనియర్ నేత షేక్ బషీర్ ఖాన్, పలువురు సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు, పత్రికా మిత్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ....గతం లో పాత పంచాయతీ భవనం లో సచివాలయం తాత్కాలికంగా విధులు నిర్వహించడం జరిగిందని అన్నారు.

# ఉద్యోగ ఉపాధ్యాయ సంక్షేమానికి సహకరించండి

**ఉద్యోగుల బకాయిలపై ప్రభుత్వం కాలయాపన వలదు .. దశల వారి పోరాటానికి బి టి ఏ సిద్ధం**

**టెక్కలి ఏప్రిల్ 1 జయ జయహే**

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయు ల ఆర్థిక ఆర్థికేతర సమస్యలపై కాలయాపన చేయడం భవ్యము కాదని ప్రజా సంక్షేమాన్ని బాధ్యతగల పరిపాలన విధానాలను అవలంబించాల్సిన ప్రభుత్వ పెద్దలు ఉద్యోగ ఉపాధ్యాయ ప్రభుత్వ సేవలు అందించే వారిపై నిర్లక్ష్యం తగదని బహుజన టీచర్స్ అసోసియేషన్ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు సీర రమేష్ బాబు పేర్కొన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యల పట్ల తీవ్రమైన కాలయాపన జరుగుతుందనీ ఉద్యోగులను నిరాశకు గురి చేసే దీర్ఘకాలిక సమస్యలపై ప్రభుత్వం పరిష్కార మార్గాలు తెరవకపోతే దశల వారి పోరాటాలకు ఉపాధ్యాయ సంఘాలు కార్యాచరణ లు చేయక తప్పదని ఆయన అన్నారు. ప్రభుత్వం తక్షణమే ఎర్నాడ్ లీవ్ ల బకాయిలు ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల ఉన్నత విద్యకు డీఈవో ద్వారా పర్మిషన్లు ఇవ్వాలన్నారు, ప్రభుత్వ పాలకుల మొండి వైఖరి పై నిరసన ధ్వనులను చేపడతామని స్పష్టం చేశారు,ఉద్యోగుల సంక్షేమాన్ని కాలయాపన చేసి నిర్వీర్యం నిర్లక్ష్య ధోరణితో ప్రభుత్వం కొనసాగించడం తగదని , ముఖ్యంగా సంక్షేమాన్ని ఆర్థికేతర సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ పాలకులు తమ బాధ్యతలు మర్చి పోయి కావాలనే పెండింగ్లో పెట్టారని దీనిపై రాష్ట్రవ్యాప్తంగా తీవ్రమైన ఆందోళనలు చేపట్టేందుకు




ఐక్య ప్రజా సంఘాలతో పోరాటం మార్గం తప్పడం లేదని తమ సమస్యల పరిష్కారానికి రాజ్యాంగబద్ధంగా శాంతియుత పోరాటమే శరణ్యమని భావించి తమ హక్కుల పరిరక్షణకు, సమస్యల పరిష్కారానికి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆలోచన విధానంతోనే పోరుబాట పడుతున్నట్లు బహుజన టీచర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పడాల ప్రతాప్ కుమార్ డిమాండ్ చేశారు, ప్రభుత్వం తక్షణమే పి అర్ సి కమిషన్ చైర్మన్ ను నియమించి పాత పింఛన్ విధానాన్ని కొనసాగించాలని, ఇంటీరియర్ రిలీఫ్ ఫండ్ ను తక్షణమే ప్రకటించాలని తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కార మార్గాన్ని న్యాయబద్ధంగా పరిష్కరించాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా డి ఆర్ ఓ విశ్వేశ్వరరావు కు వినతి పత్రం అందజేశారు,ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు బంగారు తాతారావు, పిన్నింటి వెంకటరమణ, బి టి ఏ జిల్లా అధ్యక్షులు సీర రమేష్ బాబు, పడాల ప్రతాప్ కుమార్, ట్రెజరర్ బోకర దుర్యోధన, బంగారు షణ్ముఖరావు, కోలక కృష్ణమోహన్, ఆనందరావు, ప్రేమ్ కుమార్, యానాది అమర్నాథ్, రె ల్ల రామారావు, పలువురు ఉద్యోగ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఎరువుల సంక్షోభానికి 'నానో' పరిష్కారమా?

## పెరుగుతున్న సబ్సిడీల భారం.. క్షీణిస్తున్న నేల సారం: సాగు మనుగడకు 'సాంకేతిక' విప్లవమే సమాధానం!

**భారతీయ వ్యవసాయం నేడు ఒక అనిశ్చిత సంధి కాలంలో నిలిచింది. ఒకవైపు కోట్లాది మంది ఆకలి తీర్చాల్సిన 'ఆహార భద్రత' బాధ్యత.. మరోవైపు రైతు వెన్నెముకను విరిచేస్తున్న సాగు ఖర్చులు. పెరిగిన పెట్టుబడి, తగ్గిన దిగుబడి, అస్థిరమైన మార్కెట్ ధరల మధ్య అన్నదాత జీవన చక్రం గతి తప్పుతోంది. ఒకప్పుడు దేశానికి వెన్నెముకగా నిలిచిన వ్యవసాయం, నేడు మనుగడ కోసం పోరాడుతోంది.**



### అంతర్జాతీయ సెగ – సబ్సిడీ భారం

అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు భారతీయ వ్యవసాయాన్ని అనిశ్చితిలోకి నెడుతున్నాయి. పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధ మేఘాలు, దెబ్బతిన్న సరఫరా వ్యవస్థల ఫలితంగా యూరియా, డీఏపీ వంటి ఎరువుల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఎరువుల దిగుమతులపై అధికంగా ఆధారపడే మన దేశానికి ఇది పెను సవాలు.

2026–27 ఆర్థిక సంవత్సరానికి ఎరువుల సబ్సిడీ అంచనా ₹1.7 లక్షల కోట్లు అయినప్పటికీ, ప్రస్తుత పరిస్థితులు కొనసాగితే అది ₹2 లక్షల కోట్ల మార్కును దాటడం ఖాయమని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

వృథా అవుతున్న పెట్టుబడి.. నిస్సారమవుతున్న నేలతల్లి
ప్రస్తుతం మనం వాడుతున్న సంప్రదాయ రసాయనిక ఎరువుల సామర్థ్యం అత్యంత ఆందోళనకరంగా ఉంది.

మనం చల్లుతున్న ఎరువుల్లో 60% నుండి 70% వరకు మొక్కకు అందకుండానే వృథా అవుతున్నాయి.
కొంత గాలిలో ఆవిరైపోతుంటే, మరికొంత భూగర్భ జలాల్లో కలిసి కలుషితం చేస్తోంది.
ఈ అసమతుల్య వినియోగం వల్ల రైతు పెట్టుబడి పెరగడమే కాకుండా, నేల చౌడుబారి నిస్సారంగా మారుతోంది. ఇదే ధోరణి కొనసాగితే సాగు భవిష్యత్తు అగమ్యగోచరమే.

### సాగు దిశను మార్చే 'నానో' విప్లవం

ఈ సంక్షోభానికి పరిష్కారం 'నానో ఎరువుల'లోనే ఉంది. ఇవి కేవలం పరిమాణంలో చిన్నవి మాత్రమే కాదు, పనితీరులో అత్యంత శక్తివంతమైనవి.
గరిష్ట వినియోగం: ఇవి మొక్క ఆకుల ద్వారా నేరుగా శోషించబడటం వల్ల వృథా అనేది దాదాపు తగ్గుతుంది




తక్కువ పరిమాణం – ఎక్కువ ఫలితం : సంప్రదాయంగా అవసరమయ్యే 100 కిలోల ఎరువుల ప్రభావాన్ని, కేవలం 20–30 కిలోల నానో ఎరువులతో సాధించవచ్చని పరిశోధనలు చెబుతున్నాయి.
ఖర్చు తగ్గింపు : ద్రవరూప నానో ఎరువులు, డ్రోన్ పిచికారీ వంటి ఆధునిక పద్ధతులు శ్రమను, ఖర్చును గణనీయంగా తగ్గిస్తాయి.

### ప్రభుత్వాలు - విధానపరమైన మార్పులు

నానో సాంకేతికత క్షేత్రస్థాయికి చేరాలంటే కేవలం ప్రచారం సరిపోదు, ప్రభుత్వ జోక్యం అవసరం:
వేగవంతమైన ఆమోదాలు: నానో ఎరువుల పరీక్షలు, ఆమోద ప్రక్రియలను వేగవంతం చేయాలి.
డ్రోన్ ప్రోత్సాహకాలు: ప్రతి మండల కేంద్రంలో డ్రోన్ సర్వీసులను అందుబాటులోకి తెచ్చి, రైతులకు రాయితీపై అందించాలి.
నిధుల మళ్లింపు : సబ్సిడీలను కేవలం కొనుగోలుకే కాకుండా, నానో సాంకేతికత అభివృద్ధికి, విస్తరణకు మళ్లించాలి.

నేడు వ్యవసాయం అనేది కేవలం ఎకరాల విస్తీర్ణంతో కొలిచేది కాదు.. మనం అందిపుచ్చుకునే 'సాంకేతికత'తో గెలిచేది.

నానో ఎరువులు మన నేలతల్లిని, రైతును కాపాడే అనివార్యమైన ఆయుధం. సాగును 'దండగ' నుంచి 'పండుగ'గా మార్చే దిశలో సాంకేతికత వైపు అడుగులు వేయడం ఇప్పుడు మన ముందున్న ఏకైక మార్గం.

**జి. అజయ్ కుమార్**
**వ్యవసాయ నిపుణులు**






# ప్రపంచానికి ఒరాకిల్ భారీ కుదుపు

## 30వేల మంది టెక్కీల తొలగింపు
## అందులో 12వేల మంది భారతీయులు


**అమెరికా టెక దిగ్గజం ఒరాకిల్ మంగళవారం ఒక్కసారిగా భారీ లేఆఫ్స్‌కు శ్రీకారం చుట్టింది. ప్రపంచవ్యాప్తంగా పనిచేస్తున్న సుమారు 1.62 లక్షల మంది సిబ్బందిలో 18 శాతం, అంటే దాదాపు 30,000 మందిని తొలగించినట్లు సమాచారం. వీరిలో ఏకంగా 12,000 మంది భారతదేశానికి చెందిన ఉద్యోగులే కావడం గమనార్హం. అమెరికా కాలమానం ప్రకారం మంగళవారం ఉదయం 6 గంటలకు వేలాది మంది ఉద్యోగులకు ఒకేసారి లేఆఫ్ మెయిల్స్ పంపించారు.**

కంపెనీ పునర్వ్యవస్థీకరణలో భాగంగా వారి రోల్స్ అవసరం లేదని పేర్కొంటూ తొలగింపు ఉత్తర్వులు జారీ చేశారు. మార్చి 31నే వారి చివరి పనిదినంగా ప్రకటించడంతో పాటు, కంపెనీ ల్యాప్‌టాప్‌లు, సిస్టమ్‌ల యాక్సెస్‌ను వెంటనే నిలిపివేయడం ఉద్యోగులకు షాక ఇచ్చింది. ఈ లేఆఫ్స్ ప్రభావం భారత్‌పై తీవ్రంగా పడింది. ఒరాకిల్ ఇండియాలో సుమారు 30,000 మంది ఉద్యోగులు పనిచేస్తుండగా, వారిలో గణనీయమైన శాతం ఈ కోతలకు గురైనట్లు సమాచారం. అమెరికా, కెనడాలో తొలగించిన ఉద్యోగుల్లో కూడా పెద్ద సంఖ్యలో భారతీయులే ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా మేనేజీరియల్ స్థాయిలో ఉన్న ఉద్యోగులే ఎక్కువగా ఈ వేటుకు గురైనట్లు సమాచారం. ఇది ఒక్క విడత మాత్రమేనని, ఇంకా మరిన్ని లేఆఫ్స్ ఉండే అవకాశం ఉందన్న వార్తలు ఉద్యోగుల్లో ఆందోళన పెంచుతున్నాయి. ఏ సమయంలోనైనా మరో చేదు వార్త వినాల్సి వస్తుందేమోనని ఐటీ ఉద్యోగులు టెన్షన్ పడుతున్నారు. ఒరాకిల్ ప్రస్తుతం నష్టాల్లో లేదు. ఇటీవల ముగిసిన త్రైమాసికంలో కంపెనీ లాభాలు గత ఏడాదితో పోలిస్తే 95శాతం పెరిగి 6.13 బిలియన్ డాలర్లకు చేరాయి. అయితే, కంపెనీ ఇప్పుడు ◌ంఎ డేటా సెంటర్ రంగంలో భారీగా పెట్టుబడులు పెట్టుతోంది. సుమారు 156 బిలియన్ డాలర్ల ప్రాజెక్ట చేపట్టగా, అందులో భాగంగా ఇప్పటికే 50 బిలియన్ డాలర్లు అప్పు తీసుకుంది. ఈ నేపథ్యంలో ఖర్చులను తగ్గించేందుకు ఉద్యోగాల కోతలు విధిస్తున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ చర్యల ద్వారా కంపెనీకి దాదాపు 10 బిలియన్ డాలర్ల వరకు నగదు ఆదా అవుతుందని అంచనా. ఇక తొలగించిన ఉద్యోగులకు కంపెనీ కొన్ని పరిహారాలు ప్రకటించింది. అదనంగా మూడు నెలల జీతం,కంపెనీలో పని చేసిన ప్రతి ఏడాదికి 15 రోజుల జీతం, మిగిలిన సెలవులను నగదుగా మార్చుకునే అవకాశం,కార్మిక చట్టాల ప్రకారం గ్రాట్యుటీ.అయితే, ఈ ప్రయోజనాలు కంపెనీ నిర్దేశించిన గడువు లోపు రాజీనామా చేసిన వారికే వర్తిస్తాయని పేర్కొన్నారు.

# ఇరాన్ యుద్ధంతో భౌగోళిక సంక్షోభం

(సి.హెచ్.ప్రతాప్)

**ప్రస్తుత అంతర్జాతీయ పరిణామాలను గమనిస్తే ఇరాన్ కేంద్రంగా సాగుతున్న ఉద్రిక్తతలు ప్రపంచ వ్యాప్తంగా తీవ్రమైన భౌగోళిక సంక్షోభానికి దారితీస్తున్నాయి. పశ్చిమ ఆసియాలో ఇరాన్ ఒక కీలక శక్తి కావడంతో అక్కడ తలెత్తే ఏ చిన్న అలజడి అయినా ఖండంతర ప్రభావాలను చూపిస్తుంది. ముఖ్యంగా ఇజ్రాయెల్ మరియు ఇరాన్ మధ్య పెరుగుతున్న ప్రత్యక్ష దాడులు, ప్రతిదాడులు కేవలం రెండు దేశాల మధ్య సమస్యగా మిగలకుండా ప్రపంచ దేశాల ఆర్థిక మరియు వ్యూహాత్మక ప్రయోజనాలను దెబ్బతీస్తున్నాయి. ఇరాన్ యుద్ధం అనేది ప్రపంచ శాంతికి మరియు స్థిరత్వానికి సవాలుగా మారింది.**





ఈ సంక్షోభం వల్ల కలిగే మొదటి ప్రభావం ఇంధన రంగంపై ఉంటుంది. ప్రపంచ ముడి చమురు సరఫరాలో ఇరాన్ మరియు పరిసర ప్రాంతాలు కీలక పాత్ర పోషిస్తాయి. పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో ఉండే హార్ముజ్ జలసంధి ప్రపంచ చమురు రవాణాకు ప్రధాన మార్గం. ఇక్కడ యుద్ధ వాతావరణం నెలకొంటే చమురు సరఫరా వ్యవస్థ పూర్తిగా దెబ్బతింటుంది. దీనివల్ల అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు ఆకాశాన్ని తాకుతాయి. ఫలితంగా రవాణా ఖర్చులు పెరిగి నిత్యావసర వస్తువుల ధరలు అధికమవుతాయి. ఇది కేవలం అభివృద్ధి చెందుతున్న దేశాలనే కాకుండా అభివృద్ధి చెందిన దేశాల ఆర్థిక వ్యవస్థలను కూడా కుదిపేస్తుంది. ద్రవ్యోల్బణం పెరిగి సాధారణ ప్రజల జీవన ప్రమాణాలు పడిపోయే ప్రమాదం ఉంది.
రెండవది భౌగోళిక రాజకీయ సమతుల్యత దెబ్బతినడం. ఇరాన్ పక్షాన రష్యా, చైనా వంటి దేశాలు ఉంటే, ఇజ్రాయెల్ వైపు అమెరికా మరియు యూరోపియన్ దేశాలు నిలుస్తున్నాయి. దీనివల్ల ప్రపంచం మరోసారి రెండు ధృవాలుగా విడిపోయే అవకాశం కనిపిస్తోంది. ఇది ఐక్యరాజ్యసమితి వంటి అంతర్జాతీయ సంస్థల ప్రభావాన్ని తగ్గించి బలహీనపరుస్తుంది. మధ్య ప్రాచ్యంలో అస్థిరత ఏర్పడితే అది ఉగ్రవాద సంస్థలు తిరిగి పుంజుకోవడానికి దారితీస్తుంది. శరణార్థుల సమస్య మరొక గడ్డు పరిస్థితిని సృష్టిస్తుంది. యుద్ధం వల్ల పౌరులు ప్రాణాలు కోల్పోవడమే కాకుండా పొరుగు దేశాలకు వలసలు వెళ్లడం వల్ల ఆయా దేశాల వనరులపై ఒత్తిడి పెరుగుతుంది.
సాంకేతిక మరియు రక్షణ రంగాలలో కూడా మార్పులు సంభవిస్తాయి. ఇరాన్ దగ్గర ఉన్న అత్యాధునిక క్షిపణి వ్యవస్థలు మరియు డ్రోన్ సాంకేతికత యుద్ధంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఇది ప్రపంచవ్యాప్తంగా ఆయుధాల పోటీని పెంచుతుంది. ప్రతి దేశం తమ రక్షణ కోసం భారీగా నిధులను కేటాయించాల్సి వస్తుంది. ఇది ప్రజల సంక్షేమానికి మరియు విద్య, వైద్యం వంటి రంగాలకు కేటాయించాల్సిన నిధులను హరిస్తుంది. డిజిటల్ రంగంలో సైబర్ దాడులు కూడా ఈ యుద్ధంలో భాగంగా మారాయి. బ్యాంకింగ్ వ్యవస్థలు, విద్యుత్ గ్రిడ్లు మరియు కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లు ప్రమాదంలో పడుతున్నాయి. భారతదేశం వంటి దేశాలకు ఈ సంక్షోభం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయి. ఇరాన్ మరియు ఇజ్రాయెల్ రెండింటితోనూ భారత్‌కు మంచి సంబంధాలు ఉన్నాయి. ఇరాన్‌లోని చాబహార్ ఓడరేవు మనకు వ్యూహాత్మకంగా చాలా ముఖ్యం. అక్కడ యుద్ధం జరిగితే మధ్య ఆసియా దేశాలతో మన వాణిజ్యం నిలిచిపోతుంది. అలాగే లక్షలాది మంది భారతీయులు ఉపాధి కోసం ఆ గల్ఫ్ దేశాలలో నివసిస్తున్నారు. వారి రక్షణ మరియు స్వదేశానికి తీసుకురావడం వంటి అంశాలు సవాలుగా మారుతాయి. ముగింపుగా చెప్పాల్సిన అంశం ఏమిటంటే యుద్ధం ఎప్పుడూ విధ్వంసాన్నే మిగులుస్తుంది. శాంతియుత చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవడమే ప్రపంచ క్షేమానికి మార్గం. అంతర్జాతీయ సమాజం చొరవ తీసుకుని ఇరాన్ ఉద్రిక్తతలను తగ్గించకపోతే ప్రపంచం మరో భారీ ఆర్థిక మరియు మానవీయ సంక్షోభంలో చిక్కుకోవడం ఖాయం.



# రష్యాలో కుప్పకూలిన సైనిక విమానం

## 29మంది దుర్మరణం చెందినట్లు ధృవీకరణ

క్రిమియాలో ఘోర విమాన ప్రమాదం జరిగింది. రష్యాకు చెందిన సైనిక విమానం కుప్పకూలింది. ఈ ఘటనలో 29 మంది దుర్మరణం చెందారు. ఆంటోనోవ్– 26 మోడల్‌కు చెందిన విమానం స్థానిక కాలమాన ప్రకారం మంగళవారం సాయంత్రం 6 గంటలకు క్రిమియా ద్వీపకల్పం మీదుగా వెళ్తోంది. అదే సమయంలో ఆ విమానానికి రాడర్‌తో సంబంధాలు తెగిపోయాయి. అయితే ఆ విమానం ఒక కొండను ఢకొని కూలిపోయినట్లు తెలుస్తోంది. ప్రమాద సమయంలో విమానంలో 23 మంది సైనికులు, ఆరుగురు సిబ్బంది ఉండగా.. వారందరూ మృతిచెందారని రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. సాంకేతిక సమస్య కారణంగానే ఈ ప్రమాదం జరిగి ఉంటుందని ప్రాథమిక అంచనా వేసింది. విమానంపై దాడి జరిగింది అనడానికి ఎలాంటి ఆధారాలు లేవని స్పష్టం చేసింది. ప్రమాదానికి గల కారణాలు తెలుసుకునేందుకు దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపింది. ప్రమాదానికి గురైన ఆంటోనోవ్ ఎన్– 26 విమానాలను 1960 చివరలో ప్రవేశపెట్టారు. వీటని సైనిక అవసరాలతో పాటు సరుకు రవాణాకు ఉపయోగిస్తుంటారు. అయితే ఈ మోడల్‌కు చెందిన విమానాలు గత కొన్నేళ్లుగా ప్రమాదాలకు గురవుతున్నాయి. ఇదే ఏడాది దక్షిణ సూడాన్‌లో జరిగిన ప్రమాదంలో 8 మంది ప్రాణాలు కోల్పోయారు. 2022లో ఉక్రెయిన్‌లో జరిగిన ప్రమాదంలో ఒకరు మృతిచెందగా.. 2020లో శిక్షణ విమానం కూలి 20 మంది మరణించారు.

# యుద్ధం ముగింపునకు సిద్ధమే

## షరతులు వర్తిస్తాయన్న ఇరాన్

అమెరికా– ఇజ్రాయెల్‌తో కొనసాగుతోన్న యుద్ధాన్ని ముగించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ పేర్కొన్నారు. అయితే, తమకు కొన్ని బలమైన హామీలు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టాతో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారని ఇరాన్ అధ్యక్ష కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. యుద్ధం ముగించాలంటే తాము విధించిన షరతులకు అంగీకరించాలని ఇరాన్ అధ్యక్షుడు పేర్కొన్నారు. ముఖ్యంగా భవిష్యత్తులో ఇలాంటి దాడులు పునరావృతం కావనే బలమైన హామీ ఇవ్వాలన్నారు. అప్పుడు ఈ యుద్ధం ముగించేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. ఇరాన్ అధ్యక్షుడితో జరిగిన సంభాషణ తర్వాత ఆంటోనియో కోస్టా సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. పశ్చిమాసియాలో ప్రస్తుత పరిస్థితి అత్యంత ప్రమాదకరంగా ఉందని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. పరిస్థితిని చక్కదిద్దేందుకు గల్ఫ్ దేశాలపై ఇరాన్ ప్రతీకార దాడులను తగ్గించుకోవాలని కోరారు. దౌత్య మార్గాలతో సమస్యను పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా హర్మూజ్ జలసంధిని తిరిగి తెరవడం గురించి ప్రస్తావించారు. అమెరికా ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్ నుంచి తనకు నేరుగా సందేశాలు అందుతున్నాయని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ పేర్కొన్నారు. అయితే, ఆ దేశంతో చర్చలు జరుపుతున్నామనేది దాని ఉద్దేశం కాదన్నారు. మీడియాతో మాట్లాడుతూ.. కొన్ని సందేశాలు మధ్యవర్తుల ద్వారా కూడా వచ్చాయన్నారు. యూఎస్‌తో తాము ఎలాంటి అధికారిక చర్చలు జరపడం లేదని.. ఆ దేశం చేసిన ప్రతిపాదనలపై తాము ఇంకా స్పందించలేదని వెల్లడించారు. కాల్పుల విరమణకు తాము అంగీకరించమని.. యుద్ధం ముగింపును మాత్రమే తాము కోరుకుంటున్నామని అరాగ్చీ స్పష్టం చేశారు.

# సర్పంచ్ పూర్ణిమకు ఘన సన్మానం





## సర్పంచ్ పూర్ణిమకు ప్రశంసలు

**హుకుంపేట: జయ జయహే.**

హుకుంపేట మండలం హుకుంపేట పంచాయతీ లో సర్పంచ్ సమిడ. వెంకట పూర్ణిమ సర్పంచ్ పదవికాలం ముగియడంతో సెక్రటరీ సత్య నారాయణ ఆధ్వర్యంలో సర్పంచ్ పూర్ణిమ మరియు పాలక వర్గ సభ్యులకు సన్మాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది... ఈ సందర్భంగా సర్పంచ్ పూర్ణిమ మాట్లాడుతూ ఏప్రిల్ 2 వ తేది తో సర్పంచ్, పాలకవర్గ సభ్యులు పదవి కాలం ముగుస్తున్న తరుణం లో పంచాయతీ కి ఈ 5 సంవత్సరంలు సహకరించి, సర్పంచ్ తో పాటు పంచాయతీ అభివృద్ధి కి కృషి చేసిన పాలకవర్గన్ని సన్మానించడం జరిగింది అని, ఈ 5 సంవత్సరం లు సహాయ సహకారాలు అందించిన స్థానిక పంచాయతీ ప్రజలు కు ప్రజా ప్రతినిధులు కు, ఉద్యోగులకు అందరకి హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు.. అనంతరం రానున్న రోజులు లో పదవులు తో సంబంధం లేకుండా పంచాయతీ అభివృద్దే లక్ష్యంగా కృషి చేస్తా అని ఆమె తెలిపారు ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సర్పంచ్ పూర్ణిమ చిన్న వయసులోనే భాద్యతలు చేపట్టి పంచాయతీ లో మంచి పేరు తెచ్చుకున్నారని రాబోయే రోజుల్లో ఉన్నత పదవులు చేపట్టాలని తండ్రి కి తగ్గ తనయురాలుగా ఎదగాలని సర్పంచ్ పూర్ణిమ కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమం లో సర్పంచ్ సమిడ వెంకట పూర్ణిమ, ఇఓ పిఆర్డి రామ్ నాయుడు, సెక్రటరీ సత్యనారాయణ,పంచాయతీ వార్డ్ మెంబెర్స్ నాగబాబు, వెంకట్, లక్ష్మణ్, అన్నపూర్ణ, గంగ,నూకరాజు, భాస్కర్,మచ్చమ్మ వైస్ సర్పంచ్ కోడిదాస్ గోవింద్ రావ్,ఎంపిటిసి కొమ్మ రమ,పెసా కమిటీ సభ్యులు రామకృష్ణ, గణేష్, వీర్రాజు,హుకుంపేట మండలం అధ్యక్షులు అనిల్ సచివాలయం సిబ్బంది, అంగన్వాడీ టీచర్స్, ఆశలు, స్థానిక ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



## చిన్నలబుడులో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ

**పాంగి భగత్ రామ్**

**అరకులోయ: జయ జయహే.**

పేదలకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశల మేరకు అరకు నియోజకవర్గ ఇన్చార్జి సియ్యారి దొన్ను దొర ఏపీఎస్ ఆర్టీసీ విజయనగరం జోన్ రీజనల్ చైర్మన్ ఆదేశాల మేరకు అల్లూరి సీతారామ రాజు జిల్లా అరకు వేలి మండలం చిన్నలబుడు పంచాయతీలో హట్టగూడ చిన్నలబుడు, పక్కనకుడి, మాలివలస గ్రామాలకు చిన్నలబుడు పంచాయతీ గ్రామా కమిటీ అధ్యక్షులు పాంగి భగత్ రామ్ హాజరై సచివాలయ సిబ్బందితో పెన్షన్ లబ్ధిదారుల కు వారు దగ్గర నుండి పెన్షన్ పంపిణీ కార్యక్రమం అందించడం జరిగింది. రాష్ట్ర కూటమి ప్రభుత్వం ఎక్కడ లేని విధంగా వికలాంగులకు వృదులకు పెన్షన్ అందిస్తున్నారని పేర్కొన్నారు. సూపర్ సిక్స్ పథకం సూపర్ హిట్ గా విజయవంతంగా రాష్ట్ర కూటమి ప్రభుత్వం కొనసాగిస్తున్నారని తెలిపారు. పేద బడుగు బలహీనుల వర్గాలకు రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలనుండి కృషి కృషి చేస్తున్నారని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో తాంగుల డోంబూరు. వంతల మధు. కూటమి నాయకులు పాంగి భగత్ రామ్. చిన్నలబుడు టిడిపి పార్టీ గ్రామా కమిటీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రారంభమైన బిజెపి శిక్షణా తరగతులు

**మాడుగుల ఏప్రిల్ 1 జయ జయహే**

బిజెపి దేశవ్యాప్త కార్యక్రమంలో భాగంగా దీన్ దయాల్ ఉపాధ్యాయ శిక్షణ మహా అభియాన్ కార్యక్రమం బుధవారం మాడుగుల నిర్వహించారు. రెండు రోజులు పాటు దేశవ్యాప్తంగా మండల స్థాయిలో కార్యకర్తలకు శిక్షణ ఇచ్చేందుకు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సందర్భంగా 90 రోజులు పాటు గ్రామాలలో కార్యకర్తలు చేపట్టవలసిన కార్యక్రమాలు , రాష్ట్రంలో బిజెపి చేస్తున్న కార్యక్రమాలు, సోషల్ మీడియా విధివిధానాలు, స్పెషల్ ఇంసెంటివ్ రివిజన్ వంటి వాటిపై తొలిరోజు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి సీనియర్ నాయకుడు విశాఖ జిల్లా ఇన్చార్జి అయిన పుట్ట గంగయ్య హాజరై కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో చీడికాడ మండల బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు

## కొబ్బరి చిప్పల టెండర్ కోసం వేలం ప్రకటన

**బుచ్చయ్య పేట జయ జయహే**


వడ్డాది గిరిజంభ గిరి కొండపై కొబ్బరి చొప్పుల వేలం పాట పాడుకునేవారు. ఈ నెల ఆరవ తేదీన వడ్డాది వెంకటేశ్వర స్వామి కొండపై రవాలని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త తండా కన్నబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకటేశ్వర స్వామి కొండపై కొబ్బరికాయలు కుట్టి మిగిలి ఉన్న చిపలు వేలం వేయబడినని ఆయన తెలిపారు ఈనెల 6వ తేదీన ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం వెయ్యబండని తెలిపారు. ఏప్రిల్ 7 2026 నుండి 28 2 2027 వరకు ఈ కొండపై ఉన్న కొబ్బరి చొప్పుల కి బహిరంగ వేలం వేయునట్లు ఆయన తెలిపారు. పాట పాడదలుచుకున్నవారు. ప్రథమ ధర వద్ద కింద 20000 రూపాయలు చెల్లించాలని ఆయన తెలిపారు. ఈ పాటలో పాల్గొనదల్చువారు వారి యొక్క అడ్రస్ ప్రూఫ్ నిమిత్తం ఓటర్ ఐడి కానీ ఆధార్ జిరాక్స్ గాని కమిటీకి సమర్పించాలని అన్నారు. హెచ్చుపాటదారుడు కొబ్బరికాయలు తీసుకొని సమయంలో పరిశుభ్రంగా ఉంచవలననే ఎటువంటి తగాదాలకు చేయరాదని సూచించారు. కొబ్బరి ముక్కలు ఫిబ్రవరి నెలకి మాత్రమే తీసుకోవాలని మార్చి నెలలో పాట వేరేగా ఉంటుందని ఆయన తెలిపారు. వేలంలో పాల్గొన్నవారు. వేలంపాటకు షరతులు దేవస్థానం కార్యాలయం పనీ వేలలో తెలుసుకోవచ్చని ఆయన అన్నారు.

## అమరావతికి అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు

**హోం మంత్రి అనిత**

**అమరావతి రైతుల తరపున సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు**

**విశాఖపట్నం, ఏప్రిల్ 01:(-జయ జయహే)**



అమరావతి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపినందుకు ప్రధాని నరేంద్ర మోదీకి హోంమంత్రి అనిత ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి వల్లే ఇదంతా సాధ్యమైందన్నారు. అమరావతి రైతుల తరపున సీఎం చంద్రబాబుకు హోంమంత్రి కృతజ్ఞతలు తెలియజేశారు. అమరావతిపై పోరాడి విజయం సాధించిన రైతులకు అభినందనలు తెలిపారు. అమరావతికి అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ఇది రైతుల త్యాగాలకు, శాంతియుత పోరాటానికి దక్కిన ఫలితమన్నారు. అమరావతిని అంగుళం కూడా వేరొకరు కదిపే పరిస్థితి లేకుండా కట్టుదిట్టంగా చట్టాలు, శాసనాలతో ఏర్పాటు చేసిన ఘనత కూటమి ప్రభుత్వం సొంతమన్నారు. ఆంధ్రుల ఆత్మగౌరవ రాజధానిగా అమరావతిని పునఃప్రతిష్ఠించిన కేంద్ర ప్రభుత్వానికి, మద్దతుగా నిలిచిన అన్ని పక్షాలకు హోంమంత్రి అనిత ధన్యవాదాలు తెలిపారు.



## స్వవుజ్ కోటాలో పింఛన్ అందజేత

**గుర్ల :(జయ జయహే)**

గుర్ల మండలంలోని కలవచర్ల గ్రామంలో ఇటీవల ఉపాధి హామీ పని చేస్తుండగా రౌతు వెంకటరమణ అనే వ్యక్తి మరణించాడు. మృతి చెందిన వెంకటరమణ మరణించే ముందు నెల వరకూ వృద్ధాప్య పింఛన్ను ప్రభుత్వం నుండి అందుకునే వాడు. మరణించిన తర్వాత ఆయన పింఛన్ ను స్వవుజ్ కోటాలో భార్య రౌతు మంగమ్మకు ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మేరకు సంబంధిత ప్రభుత్వ అధికారులు బుధవారం మంగమ్మకు పింఛన్ డబ్బులు ఇంటికి వెళ్లి అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువనేత బెవర కూర్మారావుతో పాటు యువకులు పాల్గొన్నారు.



## వడియా వలసలో ఘనంగా క్రికెట్ టోర్నీ ప్రారంభం

**డుంబ్రిగూడ: జయ జయహే.**

డుంబ్రిగూడ మండలం సొవ్వ పంచాయితీ వడియావలసలో సోయిత్ పోరోబ్ ఇటుకల పండుగ వేడుకలు సందర్భంగా మాలివలస వడియావలస యూత్ ఆధ్వర్యంలో బుధవారం ఒకటవ తేదీన ఈ క్రికెట్ టోర్నీ ఏర్పాటు కు గ్రామ నాయుడు కిముడు నోందో రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సొవ్వ పంచాయితీ మాజీ ఎంపీటీసీ గుంట డేవిడ్ రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం సంతోషకరమని అన్నారు. క్రీడ వల్ల మానసిక శరీరాక ఆరోగ్యం కలుగుతుందని పేర్కొన్నారు. యువత క్రీడలో రాణించాలని కోరారు. యువతకు మన్నుంచి ప్రోత్సాహం ఎప్పుడు ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సొవ్వ పంచాయితీ ఉప సర్పంచ్ కిముడు గాసిరం. మాజీ సర్పంచ్ రాంప్రసాద్. బాకా తిరుమల్. పడనాయిక్ కమలాకర్. పాంగి మోహన్ దాస్. పాంగి చిరంజీవి. పనసవలస వార్డు మెంబర్ రాంబోయి రామ్ చందర్. పడనాయక్. రెల్లి. తదితరులు పాల్గొన్నారు.



## మన్యాలకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే వంశీకృష్ణ

**విశాఖపట్నం జయ జయహే**

విశాఖ దక్షిణ నియోజకవర్గం 29వ వార్డ్ జనసేన సీనియర్ నాయకుడు మన్యాల శ్రీనివాస్ నివాసం వద్ద నూతనంగా లక్ష్మీ గణపతి విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విశాఖపట్నం దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొన్నారు ముందుగా వంశీ కృష్ణ శ్రీనివాస్ కు సాదర స్వాగతం పలికి శ్రీ లక్ష్మీ గణపతి స్వామి కి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు జనసేన సీనియర్ నాయకులు మన్యాల శ్రీనివాస్ పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ మన్యాల శ్రీనివాస్ సేవ తత్పరతతో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని, భవిష్యత్ లో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆశీర్వదిస్తూ భవిష్యత్ లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆశిస్తున్నాను అని తెలిపారు ఈ కార్యక్రమంలో 29వ వార్డ్ జనసేన సీనియర్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు



# సంక్షేమానికి పర్యాయపదంగా నిలిచిన టిడిపి

## డా.యం.ఉమేష్ రావు,రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి

**శ్రీకాళహస్తి.(జయ జయహే )**



సంక్షేమం మరియు సామాజిక న్యాయానికి అధిక ప్రాధాన్యతనిస్తూ గడచిన నాలుగు దశాబ్దాలుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్న తెలుగుదేశం పార్టీ సంక్షేమానికి పర్యాయపదంగా నిలుస్తోందని తెలుగుదేశం పార్టీ బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు కొనియాడారు.రాష్ట్ర వ్యాప్తంగా "పేదల సేవలో... ఎన్టీఆర్ భరోసా" పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా బుధవారం శ్రీకాళహస్తి పట్టణం, 18 వ వార్డు పరిధిలోని లబ్ధిదారుల వద్దకు కెళ్లి పింఛన్ సొమ్మును అందించడం జరిగింది.సంక్షేమంతో పాటు పేదల సర్వతోముఖాభివృద్ధి సాధనే లక్ష్యంగా చేసుకున్న ఎన్డీయే కూటమి ప్రభుత్వం, ప్రజారంజక పాలన అందించడంలో దేశానికే ఆదర్శంగా నిలుస్తూ, గత వైసిపి ప్రభుత్వంలో దివ్యాంగుల పెన్షన్ ను ఒక్క రూపాయి కూడా పెంచకుండా నిరాదరణకు గురి చేస్తే, చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ఎన్డీయే కూటమి ప్రభుత్వం దివ్యాంగుల పెన్షన్ రెట్టింపు పెంచి అందిస్తోందని కొనియాడారు.

"పేదలకు పట్టెడన్నం పెట్టగలిగిన నాడే దేశానికి నిజమైన స్వాతంత్ర్యం" అన్న ఎన్టీఆర్ ఆలోచనలను తుచ తప్పకుండా ఆచరణలో పెడుతూ, కేవలం సామాజిక భద్రతా పింఛను పంపిణీకి మాత్రమే నెలకు సుమారు రెండు వేల ఏడు వందల కోట్ల రూపాయలు వెచ్చించి ఆర్తులను అందుకుంటున్న గొప్ప ప్రజా ప్రభుత్వం మనది అని హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో వన్నెకుల క్షత్రియ సంక్షేమం మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి,తొట్టంబేడు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు రావిళ్ళ మునిరాజా నాయుడు,సీనియర్ నాయకులు లక్కమనేని మధుబాబు,బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు,శ్రీకాళహస్తి పట్టణ సహకార బ్యాంకు మాజీ అధ్యక్షుడు డి.వి.నారాయణ,శ్రీకాళహస్తి పట్టణ కార్యనిర్వాహక కార్యదర్శి వజ్రం కిషోర్, మైనారిటీ నాయకుడు సయ్యద్ చాంద్ బాషా,నాయీ బ్రాహ్మణ సాధికార సమితి తిరుపతి పార్లమెంటు సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్ మరియు స్వర్ణ వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలను పరామర్శించిన జ్యోతుల నవీన్

**గోకవరం జయ జయహే ప్రతినిధి**



జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా నీడ కోల్పోయిన బాధితులకు త్వరతగతిన ఇంటి షెడ్ ఏర్పాటుకు శ్రీకారంవిద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో సర్వం కోల్పోయిన గోకవరం మండలం రంప యర్రంపాలెం బాధితులను కాకినాడ జిల్లా పార్లమెంట్ అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్ పరామర్శించారు. బుధవారం నాడు గ్రామంలోని భవాని నగర్ శివారు లో కుంజాల రఘుపతి, కూతేటి దుర్గారావు కుటుంబాలను పరామర్శించి వారికి బాసటగా నిలిచారు. ప్రభుత్వం ద్వారా ఇల్లు నిర్మించుకోవడానికి సమయం పడుతున్నందున నివాసము ఉండుటకు తక్షణమే రేకు షెడ్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా ఒక షెడ్ నిర్మించడానికి బాధ్యతలను స్థానిక టిడిపి సీనియర్ నాయకులు సూరంపాలెం ప్రాజెక్టు చైర్మన్ ఉంగరాల రాముకు అప్పగించారు. మరొక షెడ్డు నిర్మాణాన్ని శ్రీ లక్ష్మీ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఉంగరాల గణేష్ కు, మరి కొంతమంది దాతలకు అప్పజెప్పడం జరిగింది. అగ్ని ప్రమాద బాధితులను ఆదుకోవడంలో గ్రామంలోని కొంతమంది దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. అగ్నిప్రమాదంలో కాలిపోయినటువంటి రేషన్ కార్డులు, ఆధార్ కార్డులు, హాల్ టికెట్, వికలాంగురాలు ఈ యొక్క సదరన్ సర్టిఫికెట్లు త్వరగా అందజేయాలని స్థానిక తహశీల్దార్ రామకృష్ణకు ,ఎంపీడీవో గోవింద్ కు ఆదేశాలను ఇచ్చారు .అగ్ని బాధితులకు పార్టీ నాయకులు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. రంప యర్రంపాలెం జిల్లా పరిషత్ హై స్కూల్ నందు మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చటించి ,పౌష్టికాహారం పై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ పిల్లా చంటిబాబు, మండల ప్రధాన కార్యదర్శి గునిపే భరత్,ఉంగరాల గణేష్, సత్యం పెద్దబ్బులు,సర్పంచ్ బాదంపూడి హర్షిత ప్రకాష్, తిరుమలాయపాలెం గ్రామ సర్పంచ్ పురంసెట్టి శివాజీ, మాజీ జెడ్పిటిసి పాలూరి బోసి బాబు,తంటికొండ దేవస్థానం చైర్మన్ బద్దిరెడ్డి అచ్చన్న దొర, దాసరి సీతారామకృష్ణ, మలిరెడ్డి సిరి,మండిగ గంగాధర్, గళ్ళ రాము,పోసిన ప్రసాద్,ఆచంట రాజు, తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ వాత్సవ్‌తో అంబటి రాంబాబు ఆత్మీయ కలయిక

**విశాఖపట్నం, ఏప్రిల్ 1, జయ జయహే :**

వైఎసఆర్సీపీ రాష్ట్ర విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ ద్రోణంరాజు శ్రీవాత్సవ్ ను మాజీ మంత్రి అంబటి రాంబాబు కలిశారు. బుధవారం ఆయన ఇంటికి వైసీపీ నేతలు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. శ్రీ వాత్సవ్ వారందరినీ సాదరంగా ఆహ్వానించి అందరికీ అల్పాహారాన్ని అందించారు. అనంతరం రాంబాబు మాట్లాడుతూ మాజీ రాజ్యసభ సభ్యుడు ద్రోణంరాజు సత్యనారాయణతో అలాగే ద్రోణంరాజు శ్రీనివాసరావుతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. వారి లాగే శ్రీవాత్సవ్ కూడా ఎల్లవేళల ప్రజలకు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ వాళ్ళ తాత నాన్నల వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్తున్నారని, రాబోయే రోజుల్లో మరెన్నో ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా శ్రీవాత్సవ్ మాట్లాడుతూ పార్టీ రీజనల్ కోఆర్డినేటర్స్, జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గం ఇంచార్జీలు అందరూ కూడా ఎల్లవేళల ఒక కుటుంబంలా ఆదరిస్తూ ప్రోత్సహిస్తున్నారని అలాగే అందరితో కలిసి పార్టీ బలోపేతానికి కృషిచేస్తానని 2029 లో మళ్ళీ జగన్ గారిని సీఎంగా గెలిపించుకుంటామన్నారు. మాజీ మంత్రి, వెస్ట్ గోదావరి రీజనల్ కోఆర్డినేటర్ గుడివాడ అమర్నాథ్, మాజీ శాసనసభ్యులు మళ్ళా విజయప్రసాద్, వాసుపల్లి గణేష్ కుమార్, అన్నంరెడ్డి అదీప్ రాజు, చింతలపూడి వెంకటరామయ్య , మాజీ మేయర్ గొలగాని హరి వెంకటకుమారి శ్రీనివాస్, ఈస్ట్ ఇంచార్జ్ మొల్లి అప్పారావు, గాజువాక ఇంచార్జి తిప్పల దేవన్ రెడ్డి, ఈ కార్యక్రమంలో వైఎసఆర్సీపీ జిల్లా అనుబంధసంఘాల అధ్యక్షులు, రాష్ట్ర కమిటీ సభ్యులు, విశాఖ దక్షిణ నియోజకవర్గ మాజీ కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, ద్రోణంరాజు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## గిరిజనులకు తప్పని డోలి మోత తిప్పలు

**డుంబ్రిగూడ: జయ జయహే.**



అల్లూరి జిల్లా డుంబ్రిగూడ మండల కేంద్రంలోని కోలాపుట్ పంచాయతీ డొక్రిపాడు గ్రామంలో రోడ్డు సౌకర్యం లేనందున పాంగి సుంద్రు. భార్య దోమిని (22) గర్భిణీ కు పురిటినొప్పిలు రావడంతో ఐదు కిలోమీటర్ల దూరం డోలిమోత తో బొడ్లమామిడి జంక్షన్ మెయిన్ రోడ్డు వరకు కుటుంబీకుల సహాయంతో మోసుకొచ్చారు. అక్కడనుండి ప్రైవేట్ వాహనంతో 11 కిలోమీటర్లు దూరం అరకు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఐదు కిలోమీటర్ల దూరంలో రోడ్డు సౌకర్యం బాగాలేనందున అక్కడ గిరిజనులు రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని గుత్తేదరుడు గ్రైనేట్ మెట్లు పోసి వదిలేసారని మాజీ సర్పంచ్ గొల్లోరి సుందర్ రావు తెలిపారు. ప్రభుత్వాలు మారిన గిరిజనుల కష్టాలు మారటం లేదు అని వాపోయారు. స్వాతంత్రం ఏర్పడి 78 నుండి 79 సంవత్సరాలు అవుతున్న ఈ డోలి మోత నివారణ అనేది తప్పడం లేదని. దీనిపై రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చొరవ చూపాలని కోరారు.

## యూనిటీ ఫర్ చారిటీ ట్రస్ట్ ద్వారా నిత్యవసర సరుకులు పంపిణీ

**డుంబ్రిగూడ: జయ జయహే**




యూనిటీ ఫర్ చారిటీ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపీణీ కార్యక్రమం గసబ పంచాయతీ సర్పంచ్ పాంగి సునీత ద్వారా ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. గసబ పంచాయతీ మొర్రిగూడ గ్రామానికి చెందిన వంతల వినోద్ పుట్టుకతో రెండు కళ్ళు (కంటి చూపు)లేకపోవడంతో ఎటువంటి పనులు చేసుకోవడం కూడా కష్టంగా మారింది. తండ్రి లేకపోవడం మరింతగా కష్టాలు ఎదుర్కొంటున్నారు. ఒక వైపు ప్రభుత్వం పెన్షన్ కూడా నిలిపి వేయడం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు.వాళ్ళ కష్టాలు గుర్తించిన గసబ సర్పంచ్ యూనిటీ ఫర్ చారిటీ ట్రస్ట్ పౌండర్ నీలి ఆదిత్య కు దృష్టిలో తీసుకొని వెళ్లి సహాయం కోరడంతో బియ్యం, కంది పప్పు పది రకాలు నిత్యావసర సరుకులు పంపీణీ చేశారు.ఈ కార్యక్రమంలో గసబ మాజీ సర్పంచ్ పాంగి సురేష్ కుమార్, ట్రస్ట్ సభ్యులు జోష్ పీన్, డాక్టర్ నారాయణ రావు తదితరులు పాల్గొన్నారు.



## పెన్షన్లు సద్వినియోగపరచుకోండి

**ఎమ్మెల్యే రాజు**

**చోడవరం ఏప్రిల్ 1 జయ జయహే**

పేదవారి సంక్షేమానికి ప్రభుత్వం అందిస్తున్న పెన్షన్లను లబ్ధిదారులు సద్వినియోగపరచుకోవాలని స్థానిక ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్ రాజు విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆయన చోడవరంలో పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పెన్షన్ అందజేస్తూ ప్రభుత్వ కార్యక్రమాలను వివరించారు. ధన్యవాదాలు తెలిపిన లబ్ధిదారులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దయవల్ల ప్రతినెల ఒకటో తేదీన లబ్ధిదారులందరికి పెన్షన్ అందుతున్నాయని వారికి రుణపడి ఉండాలని చెప్పారు. ఈ సందర్భంగా చోడవరం మండలంలో మొత్తం 12,719 మంది లబ్ధిదారులకు 53 లక్షల 68, 2000 రూపాయలు పెన్షన్లు అందజేయచ్చు ఉండగా బుధవారం 1163 మందికి 49 లక్షల 8500 పంపిణీ చేశారు. 9 శాతం పెన్షన్ పంపిణీ పూర్తయిందని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.



## భవన కార్మికులకు సంక్షేమ పథకాలు పునరుద్ధరణ

**చోడవరం ఏప్రిల్ 1 జయ జయహే**

చోడవరం సహాయ కార్మికధికారి పరిధిలో గల సబ్బవరం, దేవరాపల్లి, కె.కొటపాడు, చీడికాడ,బుచయ్య పేట,రావికమతం, మాడుగుల మండలాల్లో గల భవన నిర్మాణ కార్మికులందరకు గత నెల నుండి సంక్షేమ పథకాలు పునరిద్ధరించబడ్డాయిని సహాయ కార్మికధికారి పి. సూర్యనారాయణ తెలియజేశారు. బుధవారం చోడవరం శివాలయశీ ప్రాంగణంలో జరిగిన భవన నిర్మాణ కార్మికుల అవగాహనా సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్మికులు కుమార్తె వివాహానికి రూ.40,000, ప్రసూతి కి 20,000, సహజ మరణం కి 60,000/- దహన ఖర్చుల క్రింద 20,000/- అందజేయడం జరుగుతదన్నారు. కాబట్టి ఈ అవకాశాన్ని కార్మికులు వినియోగించు కోవాలిసినదిగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కోరుకుంటున్నాను ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ కార్మిక సంఘం ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ, శ్రీ బాల గణపతి తాపీ మేస్త్రి సంఘం అధ్యక్షులు కార్యదర్శి లు కోన నూకరాజు, నారం మధు ప్రసాద్, శ్రీ సీతారాం తాపీ సంఘం అధ్యక్షులు కార్యదర్శి లు నిట్టా నూకరాజు, మజ్జి రమణ బాబు, అనుబోతు జల ఈశ్వరరావు, దేవుడు బాబు, నొడా అప్పారావు తదితరులు పాల్గొన్నారు



## బ్రిడ్జిలు నిర్మించకపోతే ఉద్యమమే

**మాడుగుల ఏప్రిల్ 1 జయ జయహే**

మాడుగుల మండలం శంకరం పంచాయతీలోని అసంపూర్తిగా నిలిచి పోయిన రోడ్లను పూర్తి చేసి బ్రిడ్జిలు నిర్మించకపోతే ఉద్యమం తప్పదని సిపిఎం పార్టీ హెచ్చరించింది. శంకరం పంచాయతీలో కోత్తవలస,వెలగలపాడు, గోప్పూరు. తాడివలస. రాజంపేట,రాయిపాలెం గిరిజన గ్రామాలకు రోడ్లుసౌకర్యం కల్పించి కోత్తవలస, తాడివలస. గెడ్డలుపై రెండు బ్రిడ్జిలను నిర్మించాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి జి. కోటేశ్వరరావు ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి. ఇరట నరసింహమూర్తి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు కే. భవాని డిమాండ్ చేశారు. గెడ్డలు రోడ్లు పరిశీలించి బ్రిడ్జిలు రోడ్లు వేయాలని డిమాండ్ చేశారు. ఆరు గ్రామాలకు చేందిన గిరిజనులుతో నిరసన తెలుపుతూ బ్రిడ్జిలు నిర్మించకపోతే ఉద్యమం చేపడుతామన్నారు.ఎన్నికల ముందు ఈ గ్రామాలకు రోడ్లు సౌకర్యం కల్పించాలని తోమ్మిది కోట్ల ముప్పైలక్షల రూపాయలతో రోడ్లు బ్రిడ్జిలు నిర్మిస్తున్నట్లు, కోంత మేరకు పనులు చేసిన ఎన్నికల అయ్యి రెండు సంవత్సరాలు అయినా పనులు ముందుకు సాగలేదు అన్నారు. ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత మరల పాత పనులను రద్దు చేసి ఎన్ఆర్ఈజీఎస్, నాబార్డు నిదులతో కోత్తగా 11 కోట్లురూపాయలతో ఎస్టుమేట్ వేసి కూటమి ప్రభుత్వనికి ప్రతి పాదనులు పంపించి నట్లు అధికారులు చేబుతున్నారని, కావర్షం వస్తే గెడ్డలు దాట లేక గర్బిని స్త్రీలును బాలింతలను డోలిలు కట్టి మోసుకు వెళ్ళవలసి వస్తుందని తెలిపారు. చిన్నఱ పిల్లలు స్కూలుకు వెళ్ళలాన్న ముసలి వారు ఆసు పత్రికి వెల్లాలాన్న తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.గోట్టివాడ నుండి కోత్తవలస, వెలగలపాడు, గోప్పురు, తాడివలస, రాయిపాలెం, రాజంపేట, క్రిష్ణంపాలెం తారురోడ్డు వరకు రోడ్డు సౌకర్యం కల్పిస్తె వందలాది మంది గిరిజన ప్రజలకు రోడ్డు సౌకర్యం కల్పించే అవుతారని కాబట్టి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

## మత్తు పదార్థాలు, ఆన్లైన్ మోసాలపై అవగాహన





**డుంబ్రిగూడ: జయ జయహే.**

అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్దల్ ఆదేశాల మేరకు అరకు సర్కిల్ పరిధిగల డుంబ్రిగూడ మండలం సొవ్వ పంచాయితీ. కొల్లపుట్టు పంచాయతీ బిట్రగండ మారుమూల గ్రామంలో అరకు సీఐ ఎల్ హిమగిరి డుంబ్రిగూడ ఎస్ఐ ఎల్ సురేష్ డాగ్ స్కాడ్ పోలీస్ సిబ్బందితో ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించి కార్డెన్ సెర్చ్ అనంతరం గ్రామ ప్రజలతో అరకు సిఐ మాట్లాడుతూమహిళల భద్రత పై మహిళలకు అవగాహన కల్పిస్తూ,గంజాయి నేరాలు నివారణ, రోడ్డు ప్రమాదాలు నివారణ, ఆన్లైన్ మోసాలు నాటు సారా పై అవగాహన కల్పిస్తూ యువత యువకులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ముఖ్యంగా గంజాయి సాగు చేయడం రవాణా చేయడం చేసినట్లయితే వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపించడం జరుగుతుంది .కావున ఎవరు కూడా గంజాయి నాటసారాకు దూరంగా ఉండాలని ఆన్లైన్ లో పంపిస్తున్న లింకులకు డబ్బుకు ఆశపడి ఎలాంటి సమాధానాలు ఇచ్చి మోసానికి పాల్పడవద్దని రోడ్డు ప్రమాదల నివారణ పై యువత కు అవగాహన కల్పిస్తూ ఎవరైనా రోడ్లపై వాహనాలతో వేగంగా వాహనాలు నడపడం హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడం ట్రాఫిక్ రూల్స్ పాటించకుండా ఉన్నట్లయితే వాళ్లపై చట్టపరమైన చర్యలు ఉంటాయని మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేయడం జరుగుతుంది. అని హెచ్చరిస్తూ అక్కడ వచ్చిన ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక గ్రామ పెద్దలు, ప్రజలు యువతి యువకులు మహిళలు పాల్గొన్నారు.

# శబల ఆహారమే ఆరోగ్యకరం







### ప్రకృతి ఆధారంగా పండించిన పంటలే ఆరోగ్యకరం

### రసాయనాలతో భూమిని సర్వనాశనం చేయవద్దు: ఎమ్మెల్యే పూసపాటి అదితి

**సింహాచలం (జయ జయహే)**

శబల ఆహారమే ఆరోగ్యకరం అని విజయనగరం శాసనసభ్యురాలు పూసపాటి అదితి వివరించారు బుధవారం సింహాచలం గోశాల లో సేవ్ సంస్థ నిర్వహించిన శబల భోజనాలు పండుగ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ హితంగా జీవించాలి అని కోరారు. ప్రకృతి ఆధారంగా పండించిన పంటలే ఆరోగ్యకరం, ఆనందదాయకం అని వివరించారు. రసాయనాలతో భూమిని సర్వనాశనం చేయవద్దు అని పిలుపునిచ్చారు. అలాగే మన గాలి, నీరు, ఆహారం ఆరోగ్యకరమైనవిగా ఉండాలని అన్నారు. విఎం ఆర్ డి ఎ మెట్రో పొలిటిన్ కమిషనర్ తేజ్ భరత్ మాట్లాడుతూ శబల భోజనాలు పండుగకు రావటం తన అదృష్టమని భావిస్తున్నానన్నారు. ఈ విధమైన ఆహారం భుజించడం, ప్రకృతి ఆధారంగా పంటలు పండించడం చాలా గొప్ప విషయం అని పేర్కొన్నారు. రైతులు అందరూ ఈ విధంగా పంటలు పండించడం అలవర్చుకోవాలి అని కోరారు. పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ ప్రకృతి కోసం పని చేయడం చాలా గొప్ప విషయం అని వివరించారు. వేలాది మంది ప్రకృతి ఆధారంగా పంటలు పండించే రైతులు అత్యధిక సంఖ్యలో కలిసి నిర్వహిస్తున్న ఈ పండుగ వెయ్యేళ్ల క్రితం ఏ విధంగా పంటలు పండించి ఆరోగ్యకరంగా అందురూ కలిసి మెలిసి జీవించే వారో ఆ విధంగా ఈ రోజు ఇక్కడ ఒక ఆనందదాయకం అయిన పరిస్థితి ఉంది అన్నారు. ఇటువంటి కార్యక్రమాలు అధికం గా నిర్వహించాలి అని కోరారు. ఈ కార్యక్రమంలో సింహాచలం దేవస్థానం ఇఓ జె వెంకటరావు, సేవ్ సంస్థ వ్యవస్థాపకులు విజయరాం, మిల్లెట్స్ రాంబాబు, సంకల్ప కళా గ్రామం వ్యవస్థాపకులు ఆకుల చలపతిరావు, తులసి నేచురల్స్ సత్యనారాయణ, ప్రకృతి రైతులు శ్రీనాథ్, విశ్రాంత ప్రొఫెసర్ సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ప్రధానంగా ఈ పండుగ లో మహేష్ అనే రైతు కాంక్రీజ్, థార్ పార్కర్, పుంగనూరు, సాహీవాలీ, రాఠీ సంతతి కి చెందిన ఆవులు ప్రదర్శించారు. గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ, పిఠాపురం నుంచి వచ్చిన బాలు, ధాన్యం కంకులతో కుచ్చులు తయారీ శిక్షణ ఇవ్వడం జరిగింది. అలాగే తాటాకు చాపలు అల్లడం, మట్టి తో కుండలు ఊనడం, వెదురు బుట్టలు అల్లడం, కొబ్బరి ఆకులతో బొమ్మలు తయారు చేయడం, తాటాకు మట్ట తో మంచం నేయడం జరిగింది.

## గంటాను కలిసిన డైరక్టర్ సుకుమార్

**విశాఖపట్నం, ఏప్రిల్ 1, జయ జయ హే**



భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును స్టార్ డైరక్టర్ సుకుమార్ ఎంవీపీ కాలనీ నివాసంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తెలుగు సినీ పరిశ్రమ అభివృద్ధికి సంబంధించిన అంశాలు వారు మధ్య చర్చకు వచ్చాయి. విశాఖ సినిమా షూటింగ్ లకు అనువైన ప్రదేశమని పేర్కొన్నారు. బ్లాక్ బస్టర్ సినిమాలతో దేశవ్యాప్త క్రేజ్ తీసుకువచ్చిన సుకుమార్ భవిష్యత్ లో మరిన్ని సక్సెస్ ఫుల్ సినిమాలు తియ్యాలని గంటా ఆకాక్షించారు. సుకుమార్ ను శాలువా కప్పి సన్మానించారు. మైత్రి మూవీ మేకర్స్ నవీన్ ఎర్నేని కూడా ఉన్నారు.

### ఆదివాసీ సత్యాగ్రహ యాత్ర ముగింపు ర్యాలీ

## జయప్రదం చేద్దాం

### పార్టీలకతీతంగా పాల్గొనాలి

### ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం పిలుపు

**అరకులోయ: జయ జయహే.**



ఆదివాసి సత్యాగ్రహ యాత్ర "ముగింపు ర్యాలీ" విజయవంతం చేయాలని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం పిలుపునిచ్చారు ఈ సందర్భంగా అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం మాట్లాడుతూ. ఆదివాసులకు అడుగడుగున అన్యాయం జరుగుతూనే ఉందని అన్నారు. ఆదివాసులకు జరుగుతున్నటువంటి అన్యాయాలకు వ్యతిరేకంగా ఈ నెల 3 వతేదీన శుక్రవారం పాడేరు మండల కేంద్రంలో, జరిగే షెడ్యూల్ ప్రాంత నియామక చట్టం కొరకు ఆంధ్రప్రదేశ్ ఆదివాసి జేఏసీ చేపట్టిన "ఆదివాసి సత్యాగ్రహ యాత్ర ముగింపు భారీ ర్యాలీని" పార్టీల కతీతంగా విజయవంతం చేయాలని అన్నారు. వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జడ్పిటిసిలు, ఎంపీపీలు, సర్పంచులు ఎంపీటీసీలు, వైస్ ఎంపీపీలు, జిల్లా, మండల గ్రామపంచాయతీ వైయస్సార్ కాంగ్రెస్ కమిటీ నాయకులు, సభ్యులు, కార్యకర్తలు, మాజీ సర్పంచ్లు, మాజీ ఎంపిటిసిలు, వైసీపీ సీనియర్ నాయకులు తప్పనిసరిగా ఆదివాసి సత్యాగ్రహ యాత్ర ముగింపు ర్యాలీలో స్వచ్ఛందంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.



### మంత్రి కందుల దుర్గేష్‌పై

## అసత్య ప్రచారం

### నిడదవోలు నేతల ఆగ్రహం

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి :**

ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ మంత్రి, నిడదవోలు శాసనసభ్యుడు కందుల దుర్గేష్‌పై ఒక టీవీ ఛానల్ అసత్య ప్రచారం చేసిన కథనాలపై నిడదవోలు నియోజకవర్గ జనసేన నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, మంత్రి ప్రతిష్టను దెబ్బతీసేలా అసత్య వార్తలు ప్రసారం చేయడం ఖండనీయమని పేర్కొన్నారు. నేతలు వెల్లడించిన వివరాల ప్రకారం, మంత్రి దుర్గేష్ ద్వితీయ శ్రేణి నాయకత్వాన్ని ప్రోత్సహించడం లేదన్న వార్తల్లో ఎలాంటి నిజం లేదన్నారు. పట్టణ, మండల స్థాయి నాయకులందరికీ ఆయన సముచిత ప్రాధాన్యం ఇస్తున్నారని స్పష్టం చేశారు. సభ్యత్వ నమోదు విషయంలోనూ ఎన్టీవీ కథనాలు వాస్తవాలకు విరుద్ధమని తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి జనసేన సభ్యత్వం గణనీయంగా పెరిగి, సుమారు 14 వేల నుండి 20 వేలకుపైగా చేరిందని వివరించారు. నియోజకవర్గ అభివృద్ధి విషయానికి వస్తే, గత 64 ఏళ్లలో ఎన్నడూ జరగని విధంగా నిడదవోలు మున్సిపాలిటీని "స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీ"గా అప్‌గ్రేడ్ చేయడంలో మంత్రి కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. అదేవిధంగా, నియోజకవర్గ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం నుండి సుమారు రూ.500 కోట్లు, కేంద్ర ప్రభుత్వం నుండి రూ.400 కోట్లు తీసుకువచ్చి సిసి రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జనసేన అధ్యక్షునిగా బాధ్యతలు నిర్వహిస్తున్నందునే అక్కడ కార్యాలయం ఏర్పాటు చేశారని, దానిని తప్పుగా ప్రచారం చేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కళ్యాణ్, భూపతి ఆదినారాయణ, రంగ రమేష్, పోలిరెడ్డి వెంకటరత్నం, రాజాతో పాటు జనసేన పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీ నూకాంబికా అమ్మవారిని దర్శించుకున్న ప్రవచనకర్త

### చాగంటి కోటేశ్వరావు

**అనకాపల్లి జయ జయహే**

అనకాపల్లి స్థానిక గవరపాలెం లో వేంచేసి ఉన్న ఉత్తరాంధ్ర ఇలవేల్పు ఆరాధ్య దైవమైన శ్రీ శ్రీ శ్రీ నూకాంబిక అమ్మవారి జాతర మహోత్సవం లో భాగంగా ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు శ్రీ నూకంబిక అమ్మవారిని దర్శించుకోవడం జరిగింది. ధర్మకర్త మండలి ఆహ్వానం మేరకు ఆయన ప్రవచనాలు ఇచ్చేందుకు రావడం జరిగింది. వీరికి దేవస్థానం పాలకమండలి సభ్యులు, స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, వేద పండితులు ఘనంగా స్వాగతం పలకడం జరిగింది . ఆలయ పండితులు వేద మంత్రోచ్చరణల తో అమ్మవారు వద్దకు తోడుకొని వెళ్లడం జరిగింది. వీరి గోత్రనామాలతో అమ్మవారు కుంకుమ పూజ నిర్వహించి అనంతరం చాగంటి కోటేశ్వరావుకు ఆలయ మండపంలో స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ఆయనను దుస్సాలువతో సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని బహుకరించే సత్కరించడం



జరిగింది. అనంతరం స్థానిక ఎన్టీఆర్ స్టేడియం లో ఏర్పాటుచేసిన ఆయన ప్రసంగ కార్యక్రమం అనర్గళంగా ఘనంగా నిర్వహించడం జరిగింది. అయినా భక్తి ప్రసంగం భక్తులను బాగా ఆకట్టుకోవడం జరిగింది ఆయనను చూసేందుకు భక్తులు, అభిమానులు ఆయన ప్రసంగం వినుటకు ఎన్టీఆర్ స్టేడియం తరలి వచ్చిన జనంతో కిక్కిరిసిపోయింది. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నాగ శీను, ఈవో శ్రీధర్ పాలకమండల సభ్యులు, కూటమిసభ్యులు తదితరులు పాల్గొనడం జరిగింది






### సమిష్టి భాగస్వామ్యంతో

## కాకినాడ ప్రగతి

### నూతన జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

**కాకినాడ, ఏప్రిల్ 1, జయ జయహే**



ప్రజలు, ప్రజాప్రతినిధులందరి సమిష్టి భాగస్వామ్యంతో కాకినాడ జిల్లాను అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో నడిపిస్తామని పదవీ బాధ్యతలు చేపట్టిన నూతన జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ తెలిపారు. బుధవారం కాకినాడ జిల్లా నూతన కలెక్టరుగా ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ బాధ్యతలు చేపట్టారు. ఆయన విశాఖపట్టనం నుండి అన్నవరం చేరుకుని శ్రీ వీర వేంకట సత్యన్నారాయణ స్వామి వారిని దర్శించి, అర్చన, ఆశీర్వాద కార్యక్రమాలలో పాల్గొన్నారు. అక్కడి నుంచి కాకినాడ జిల్లా కలెక్టరు కార్యాలయాని చేరుకోగా ఆయనకు జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, అసిస్టెంట్ కలెక్టర్ మనీషా, డిఆరఓ డి.తిప్పేనాయక్, జిల్లా అధికారులు, వేదపండితుల పూర్ణకుంభం, మేళతాళాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కలసిన మీడియా ప్రతినిధులతో కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ ఘన చరిత్ర, ఎన్నో విశిష్టతలు కలిగిన కాకినాడ జిల్లాలో పనిచేయడం తనకు లభించిన అపూర్వ అవకాశమని పేర్కొంటూ, ఈ అవకాశం కల్పించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. విశాఖ కలెక్టర్, జివిఎంసి కమిషనర్ గాను పనిచేసిన అనుభవంతో కాకినాడ జిల్లాలో గ్రామీణ, పట్టన ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానని తెలియజేశారు. ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ఫలాలు అందరికీ అందించేందుకు, అధికారుల సమన్వయం, ప్రజాప్రతినిధుల సహకారంతో జిల్లాను ముందుకు నడిపిస్తామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి ఆదేశాల కనుగుణంగా పేదరిక నిర్మూలన, స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాల సాధన ప్రాధాన్యతలుగా పనిచేస్తామని, ముందు పనిచేసిన కలెక్టర్లు చేపట్టిన వినూత్న కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు. కాకినాడ వ్యవసాయ ప్రధాన జిల్లా అయినందున, రైతులు తక్కువ ఖర్చుతో అధిక ఉత్పాదనలు, ఆదాయం పొందేలా కార్యక్రమాలు చేపడతామన్నారు. జిల్లా భౌగోళిక విశిష్టతలను గరిష్ట స్థాయిలో సద్వినియోగంలోకి తేవడం ద్వారా జిల్లా ఆర్థిక ప్రగతికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ డిసి రమేష్ బాబు, ఆర్డిఓలు ఎస్.మల్లిబాబు, ఎన్.శ్రీధర్, సిపిఓ పి.త్రినాథ్, డ్వామా పిడి పి.వెంకట లక్ష్మి, సమాచారశాఖ డిడి పి.తిమ్మప్ప, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సెక్షన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



### ఈర్లె శ్రీరామ్మూర్తికు

## జన్మదిన శుభాకాంక్షలు చొక్కాకుల

**చోడవరం (జయ జయహే)**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘ వ్యవస్థాపక అధ్యక్షులు, ప్రస్తుత గౌరవ అధ్యక్షులు, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ మరియు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర మీడియా ప్యానలిస్టు ఈర్లె శ్రీరామ్మూర్తి జన్మదిన వేడుకలు నాయకులు, అభిమానుల ఘనంగా నిర్వహించారు . ఈ కార్యక్రమంలో చోడవరం శాసనసభ్యులు కె ఎస్ ఎన్ రాజు, అనకాపల్లి పార్ల మెంట్ నియోజకవర్గం ఇంచార్జి విజయ నాయుడు, రాష్ట్ర కొప్పులవెలమ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పివిజి కుమార్, నన్నయ యూనివర్సిటీ పూర్వపు ఉపకులపతి ఆచార్య ముర్రు ముత్యాల నాయుడు, చోడవరం జనసేన పార్టీ కోఆర్డినేటర్ పివిఎస్ఎన్ రాజు, రాష్ట్ర రెవెన్యూ సంఘం అధ్యక్షులు ఆంజనేయ కుమార్, జడ్పిటిసి దొండా రాంబాబు, విశాఖపట్నం వెలమ సంక్షేమ సంఘం సెంట్రల్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు చుక్క చిన్నబాబు, మాడుగుల నియోజకవర్గం బిజెపి ఇంచార్జ్ సత్యనారాయణ, గోవాడ సుగర్ ఫ్యాక్టరీ అధ్యక్షుడు అల్లం రామ అప్పారావు, మాజీ సుగర్ ఫ్యాక్టరీ అధ్యక్షులు గునూరు మల్లునాయుడు, బిజెపి సీనియర్ నాయకులు బొడ్డేటి కాశీవిశ్వనాథ్ తదితరులు పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు వెంకటరావు మరియు అంతకాపల్లి ఎంపీటీసీ చొక్కాకుల గోవింద పాల్గొని గజమాలవేసి, సాలువాతో సత్కరించారు. తదనంతరం కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్బవరం ఎంపీటీసీ బైలపూడి దేముడుబాబు, సబ్బవరం బీజేపీ పార్టీ అధ్యక్షులు గొంప నర్సింగరావు, మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ రెడ్డి రామునాయుడు, బిజెపి సీనియర్ నాయకులు వనం సత్యం నారాయణ, సనపల చినబాబు, పల్లా రమణ, బైలపూడి రమణ, చొక్కాకుల రామకృష్ణ, ఆదిరెడ్డి శ్రీకాంత్, ఉద్యోగులు, వీఆర్వోలు, కూటమి నాయకులు తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.



# దేశ నిర్మాణంలో యువతదే కీలకపాత్ర

## కేంద్రీయ విశ్వ విద్యాలయ ఇన్చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జితేంద్ర మోహన్ మిశ్రా





**విజయనగరం, ఏప్రిల్ 1, జయ జయహే**

దేశ నిర్మాణంలో యువతదే కీలక పాత్ర అని కేంద్రీయ విశ్వ విద్యాలయ ఇన్చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జితేంద్ర మోహన్ మిశ్రా అన్నారు. కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ సహకారంతో "వికసిత భారత్ యువ కనెక్ట్ ప్రోగ్రామ్ - 2026 కార్యక్రమం బుధవారం యూనివర్సిటీ సెమినార్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. యువతలో నాయకత్వ లక్షణాలు, జాతీయాభివృద్ధి పట్ల బాధ్యతాభావం పెంపొందించడం లక్ష్యంగా జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వికసిత భారత్ లక్ష్య సాధనలో విద్య, నైపుణ్యాభివృద్ధి, ఆవిష్కరణలు ప్రధాన ఆధారాలన్నారు. యువత తమ సామర్థ్యాన్ని గుర్తించి, సమాజానికి సేవ చేసే దిశగా ముందుకు సాగాలని, దేశాభివృద్ధికి సృజనాత్మక ఆలోచనలు మరియు కృషి అవసరమని పిలుపునిచ్చారు. నోడల్ అధికారి, ఇంగ్లీష్ విభాగ ఇన్‌ఛార్జ్ హెడ్ డాక్టర్ బాలుమూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ యువతలో సామాజిక అవగాహన, నాయకత్వ నైపుణ్యాలు పెంపొందించడంలో వికసిత భారత్ యూత్ కనెక్ట్ కార్యక్రమం ఒక ముఖ్య వేదికగా నిలుస్తుందన్నారు. గౌరవ అతిథిగా పాల్గొన్న యువజన మంత్రిత్వ శాఖ కన్సల్టెంట్ సుహాని పాండే మాట్లాడుతూ యువతకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ పథకాలు, అవకాశాలను వివరించారు. యువత తమ ప్రతిభను వినియోగించుకొని నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, సామాజిక బాధ్యతతో ముందుకు సాగాలని ఆమె సూచించారు. సమగ్ర అభివృద్ధి కోసం యువతలో చైతన్యం మరియు సక్రమ దిశా నిర్దేశం అవసరమని ఆమె పేర్కొన్నారు. యూత్ ఐకాన్‌గా పాల్గొన్న కుసుంబ బాల శ్రీ నందక్ తన అనుభవాలను పంచుకుంటూ, యువత తమ లక్ష్యాలను స్పష్టంగా నిర్దేశించుకొని కృషి చేస్తే విజయాలు సాధ్యమవుతాయని తన స్వీయ అనుభవాలను, విజయాలను తెలిపారు. క్రమశిక్షణ, పట్టుదల, స్వీయ విశ్వాసం విజయానికి మూలస్తంభాలు అని, ప్రతి యువకుడు సమాజానికి ఆదర్శంగా నిలవాలని తెలిపాడు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంక్షేమ డీన్ డాక్టర్ బొంతు కోటయ్య, వివిధ విభాగాధిపతులు, ఆద్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# సార్.. కొత్త కలెక్టర్...ఫర్లేదా...!

**- మనకు ఇబ్బందేమీ రాదు కదా...!**

**- ఏదన్నా ఉంటే ముందుగా చెప్పు గురూ...!**

**- జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగుల ఆరా**

**(జయ జయహే బ్యూరో - విశాఖపట్నం )**

విశాఖ జిల్లా కలెక్టర్‌గా ఎం. అభిషిక్త్ కిషోర్ బాధ్యతలు చేపట్టారు. ఆయన బాధ్యతలు చేపట్టక ముందు నుంచే రెవెన్యూ వర్గాల్లోనే కాకుండా మిగిలిన అన్ని ప్రభుత్వ శాఖల్లోనూ కొత్త కలెక్టర్ కోసం ఉత్కంఠ పెరిగిపోయింది. ఆయన గురించి తెలుసుకోవాలనే కాంక్షతో కలెక్టరేట్‌లోని అన్ని విభాగాల ఉద్యోగులకు ఫోన్లు తెగ వచ్చాయి. కొత్త కలెక్టర్ సంగతులు ఏంటంటూ ఆరా తీయడం మొదలెట్టేశారు. కొత్త కలెక్టర్ ఫర్లేదా...మనకేమీ ఇబ్బంది రాదు కదా...ఏదన్నా వుంటే ముందుగా చెప్పు గురూ...అంటూ చెప్పుకోవడం కనిపించింది. గత నాలుగున్నరేళ్ల పాటు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నెట్టుకొచ్చేస్తున్నాం...గత ఇద్దరు కలెక్టర్లు మన జోలికైతే పెద్దగా రాలేదు... ఎలాంటి ఫైల్ పెట్టినా సూచనలు చేశారే గానీ ఆడిపోసుకున్న సందర్భాలు లేవు. ఎమ్మెల్యే తాలూకో...మంత్రి తాలూకో అంటే ఏమనే వారు కాదు. ఏంచక్కా పనులకు పనులు..డబ్బుకు డబ్బూ రెండూ వచ్చేసేవి. కానీ ఈ కొత్త కలెక్టరే ఎలా ఉంటారోనని భయమేస్తోంది...ఈయనెలా ఉంటారో చూడాలి మరి అంటూ ఉద్యోగులు తెగ గుసగుసలాడుకుంటున్నారు. విశాఖ జిల్లా అంటే అంతా రెండు మూడు మండలాలు మినహా మిగిలినదంతా మహా విశాఖ నగరమే. ఇక్కడ 90 శాతం మంది ఉద్యోగులే. ఏ రకంగా చూసినా కలెక్టరేట్‌తో అనుబంధం ఉన్న వారే. అందుకే కొత్త కలెక్టర్ వస్తున్నారన్నప్పటి నుంచి ఒక్కో ప్రభుత్వ ఉద్యోగి ఆయన కోసం ఆరా తీయడం మొదలెట్టేశారు. ఆయన పేరు కాస్త అభిషిక్త్ అని ఉండడంతో మనోడా...పొరుగు రాష్ట్రమా అంటూ తెగ ఆరాట పడిపోయారు. మొత్తానికి నెల్లూరు వాసేనని తెలుసుకున్నాక కాస్త హమ్మయ్య అంటూ ఊపిరి పీల్చుకున్నారు. ఇప్పుడు చూడాలి...మీది తెనాలి...మాది తెనాలి అంటూ వరసలు కలిపేస్తారేంటో చూడాలి అంటూ ఉద్యోగులు చెప్పుకుంటున్నారు.

## విశాఖ అభివృద్ధికి కంకణబద్ధుడినై పనిచేస్తా...!

### బాధ్యతలు స్వీకరించిన జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్



విశాఖపట్నం జిల్లా అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి కంకణబద్దుడినై పని చేస్తానని, ప్రతి పథకం నిజమైన లబ్ధిదారులకు చేరేలా, అభివృద్ధి ఫలాలు అందరికీ అందేలా కృషి చేస్తానని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ పేర్కొన్నారు. నూతన కలెక్టర్ గా బుధవారం మధ్యాహ్నం తన ఛాంబర్లో బాధ్యతలు స్వీకరించిన ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లా సమగ్ర అభివృద్ధి తన ప్రాధాన్యతగా ఉంటుందని స్పష్టం చేశారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, ఆ దిశగా శాయశక్తులా పని చేస్తానని ఉద్ఘాటించారు. ప్రజలతో నేరుగా మమేకమై, వారి సమస్యలను తెలుసుకుని వేగంగా పరిష్కరించడం తన ప్రధాన బాధ్యతగా భావిస్తున్నానని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రతి ప్రాంతాన్ని సందర్శించి, స్థానిక అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికలు రూపొందిస్తానని చెప్పారు. భోగాపురం విమానాశ్రయం ప్రారంభం, పోర్టు ఆధారిత అభివృద్ధి, పరిశ్రమల విస్తరణ వంటి అంశాలు విశాఖపట్నం అభివృద్ధికి కొత్త దిశను తీసుకువస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ అవకాశాలను సమర్థంగా వినియోగించుకుని జిల్లాను రాష్ట్ర అభివృద్ధికి మార్గదర్శకంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు. జిల్లా యంత్రాంగంతో సమన్వయంతో పనిచేస్తూ పారదర్శకత, సమర్థతతో పరిపాలన అందించేందుకు కట్టుబడి ఉంటానని పేర్కొన్నారు. ఈ అభివృద్ధి ప్రయాణంలో ప్రజల సహకారం అత్యంత కీలకమని, అందరూ కలిసి విశాఖపట్నాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. తాను ఆంధ్రావాడినేనని, తన స్వస్థలం నెల్లూరు అని, అమ్మానాన్నా ఇద్దరూ ప్రభుత్వ ఉద్యోగులే అని కలెక్టర్ తెలిపారు. ఇప్పటి వరకు వివిధ హోదాల్లో సేవలందించానని, తూర్పు గోదావరి, ప్రకాశం జిల్లాల్లో సబ్ కలెక్టర్ గా, ఐటీడీఏ పీవోగా, మున్సిపల్ కమిషనర్ గా, జాయింట్ కలెక్టర్ గా పని చేసినట్లు వివరించారు. అలాగే అన్నమయ్య జిల్లా కలెక్టర్ గా, ఫైనాన్స్, కమిర్షియల్ టాక్స్, ఇండస్ట్రీస్ విభాగాల్లో సేవలందించానని చెప్పారు. విశాఖ జిల్లాకు రావటం ఆనందంగా ఉందన్నారు. ముఖ్యమంత్రికి, ప్రభుత్వానికి ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నా అని అభిషిక్త్ కిశోర్ అన్నారు. జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, వీఎంఆర్డీఏ కమిషనర్ తేజ్ భరత్, ఇతర అధికారులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

# ఘనంగా డి లిటిల్ స్టార్స్ ప్రీ స్కూల్ వార్షికోత్సవ వేడుకలు






**ఉక్కునగరం (జయ జయహే)**

డి లిటిల్ స్టార్స్ ప్రీ స్కూల్ 9వ వార్షికోత్సవ వేడుకలు ఉక్కు నగరం స్టీల్ క్లబ్లో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో చిన్నారులు తమ ప్రతిభను అద్భుతంగా ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు.ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా స్టీల్ ప్లాంట్ జీఎం ఎం మధుసూదన్ సౌత్ ట్రాఫిక్ సిఐ సిహెచ్ ప్రసాద్, డాక్టర్ . ప్రియాక డా. ఫౌండర్ అండ్ సెక్రటరీ, శ్రీ కళారాధన మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ డా తాళ్లపాక సందీప్,ఏ డి సి చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ స్టీల్ క్లబ్ సెక్రటరీ పెంటకోట రామకృష్ణ, జాయింట్ సెక్రెటరీ వై. రవి కుమార్ అసిస్టెంట్ మేనేజర్ వి.ఎస్.బి రాజు పాల్గొన్నారు ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పి కమల్ కుమార్ మాట్లాడుతూ, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. అలాగే పాఠశాల ప్రిన్సిపాల్ ప్రిన్సిపాల్ సిహెచ్ సుజాత కూడా విద్యార్థుల ప్రతిభను అభినందించారు.చిన్నారుల నృత్యాలు, గీతాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ప్రేక్షకులను ఎంతో అలరించాయి. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మరియు సిబ్బందికి పాఠశాల యాజమాన్యం హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు



# శ్రీ సుబ్రహ్మణ్యస్వామి మాలధారణ భక్తులకు వాసుపల్లి ఆర్థిక సాయం

**విశాఖపట్నం (జయ జయహే)**

నగరంలోని దక్షిణ నియోజకవర్గం 30వ వార్డు లో శ్రీసుబ్రమణ్య స్వామివారి చైత్ర పౌర్ణమి మహోత్సవాల్లో మాల ధరించిన భక్తులకు మాజీ ఎమ్మెల్యే దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త ₹10,000/- రూపాయలు విరాళం అందజేశారు. ఆసీలమెట్ట కార్యాలయంలో బుధవారం వార్డు ప్రెసిడెంట్ దశమంతల మాణిక్యాలరావు తో కలిసివారంతా వాసుపల్లి గణేష్ కుమార్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. స్వామి వారి వేడుకలకు మాల దీక్షలు విరమణకు సంబంధించి సాయం అందజేశారు. మార్చి నెలలో చైత్ర పౌర్ణమి వేడుకలు పురస్కరించుకొని శ్రీ సుబ్రహ్మణ్య స్వామిని స్థానికులు ఎంతో భక్తి శ్రద్ధలతో మాల ధరించి ఆరాధిస్తారన్నారు. వారికి తన వంతు సాయంగా సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని వాసుపల్లి తెలిపారు. యూత్ ప్రెసిడెంట్ బంగారు బాబ్జి మాట్లాడుతూ దీక్షల ముగించుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహిస్తామని, తమకు సహాయ సహకారాలు అందించిన వాసుపల్లి గణేష్ కుమార్ కి కృతజ్ఞతలు తెలియజేశారు

# యుద్ధం ముగింపునకు సిద్ధమే

## షరతులు వర్తిస్తాయనన ఇరాన్

**(జయ జయహే)**

అమెరికా- ఇజ్రాయెల్‌తో కొనసాగుతోన్న యుద్ధాన్ని ముగించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ పేర్కొన్నారు. అయితే, తమకు కొన్ని బలమైన హామీలు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టాతో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారని ఇరాన్ అధ్యక్ష కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. యుద్ధం ముగించాలంటే తాము విధించిన షరతులకు అంగీకరించాలని ఇరాన్ అధ్యక్షుడు పేర్కొన్నారు. ముఖ్యంగా భవిష్యత్తులో ఇలాంటి దాడులు పునరావృతం కావనే బలమైన హామీ ఇవ్వాలన్నారు. అప్పుడు ఈ యుద్ధం ముగించేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. ఇరాన్ అధ్యక్షుడితో జరిగిన సంభాషణ తర్వాత ఆంటోనియో కోస్టా సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. పశ్చిమాసియాలో ప్రస్తుత పరిస్థితి అత్యంత ప్రమాదకరంగా ఉందని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. పరిస్థితిని చక్కదిద్దేందుకు గల్ఫ్ దేశాలపై ఇరాన్ ప్రతీకార దాడులను తగ్గించుకోవాలని కోరారు. దౌత్య మార్గాలతో సమస్యను పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా హర్మూజ్ జలసంధిని తిరిగి తెరవడం గురించి ప్రస్తావించారు. అమెరికా ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్ నుంచి తనకు నేరుగా సందేశాలు అందుతున్నాయని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ పేర్కొన్నారు. అయితే, ఆ దేశంతో చర్చలు జరుపుతున్నామనేది దాని ఉద్దేశం కాదన్నారు. మీడియాతో మాట్లాడుతూ.. కొన్ని సందేశాలు మధ్యవర్తుల ద్వారా కూడా వచ్చాయన్నారు. యూఎస్‌తో తాము ఎలాంటి అధికారిక చర్చలు జరపడం లేదని.. ఆ దేశం చేసిన ప్రతిపాదనలపై తాము ఇంకా స్పందించలేదని వెల్లడించారు. కాల్పుల విరమణకు తాము అంగీకరించమని.. యుద్ధం ముగింపును మాత్రమే తాము కోరుకుంటున్నామని అరాగ్చీ స్పష్టం చేశారు.



# రష్యాలో కుప్పకూలిన సైనిక విమానం

## 29మంది దుర్మరణం చెందినట్లు ధృవీకరణ

**(జయ జయహే)**

క్రిమియాలో ఘోర విమాన ప్రమాదం జరిగింది. రష్యాకు చెందిన సైనిక విమానం కుప్పకూలింది. ఈ ఘటనలో 29 మంది దుర్మరణం చెందారు. ఆంటోనోవ్- 26 మోడల్‌కు చెందిన విమానం స్థానిక కాలమాన ప్రకారం మంగళవారం సాయంత్రం 6 గంటలకు క్రిమియా ద్వీపకల్పం మీదుగా వెళ్తోంది. అదే సమయంలో ఆ విమానానికి రాడర్‌తో సంబంధాలు తెగిపోయాయి. అయితే ఆ విమానం ఒక కొండను ఢీకొని కూలిపోయినట్లు తెలుస్తోంది. ప్రమాద సమయంలో విమానంలో 23 మంది సైనికులు, ఆరుగురు సిబ్బంది ఉండగా.. వారందరూ మృతిచెందారని రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. సాంకేతిక సమస్య కారణంగానే ఈ ప్రమాదం జరిగి ఉంటుందని ప్రాథమిక అంచనా వేసింది. విమానంపై దాడి జరిగింది అనడానికి ఎలాంటి ఆధారాలు లేవని స్పష్టం చేసింది. ప్రమాదానికి గల కారణాలు తెలుసుకునేందుకు దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపింది. ప్రమాదానికి గురైన ఆంటోనోవ్ ఎన్- 26 విమానాలను 1960 చివరలో ప్రవేశపెట్టారు. వీటని సైనిక అవసరాలతో పాటు సరుకు రవాణాకు ఉపయోగిస్తుంటారు. అయితే ఈ మోడల్‌కు చెందిన విమానాలు గత కొన్నేళ్లుగా ప్రమాదాలకు గురవుతున్నాయి. ఇదే ఏడాది దక్షిణ సూడాన్‌లో జరిగిన ప్రమాదంలో 8 మంది ప్రాణాలు కోల్పోయారు. 2022లో ఉక్రెయిన్‌లో జరిగిన ప్రమాదంలో ఒకరు మృతిచెందగా.. 2020లో శిక్షణ విమానం కూలి 20 మంది మరణించారు.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com